విశాలాంధ్ర

ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

సోమవారం 23 డిసెంబర్ 2024 8 పేజీలు



సంక్షేమ పథకాలకు ఐవీఆర్ఎస్

- ప్రజాభిప్రాయమే కీలకం
- తాజాగా ప్రభుత్వం నిర్ణయం
- సర్వే ఆధారంగా మార్పులు చేర్పులు
- నిజమైన అర్హులకు పథకాలు
- ప్రజలకు సంతృప్తికరమైన సేవలు

ప్రజాభిప్రాయ సేకరణకు కూటమి ప్రభుత్వం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించబోతోంది. ప్రజాభిప్రాయమే లక్ష్యంగా పాలనలో మార్పులకు శ్రీకారం చుట్టనుంది. ఇందుకు సార్వత్రిక ఎన్నికలలో టీడీపీ అధినేత, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రయోగించిన ఐవీఆర్ఎస్ (ఇంటర్ ఆక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టం) సంక్షేమ పథకాల అమలుకు ఉపయోగించుకోవాలని భావిస్తున్నారు. ప్రజల నుంచి నేరుగా సేకరించిన అభిప్రాయాలకు విలువ ఇవ్వడం ద్వారా పథకాలను సమర్థవంతంగా అమలు చేయొచ్చని ఆలోచిస్తున్నారు. సంక్షేమ పథకాలతో జీవన ప్రమాణాలు మెరుగ్గా ఉన్నాయా..? కొత్తగా అమలు చేయాలనుకున్న పథకాలను ఏ విధంగా రూపకల్పన చేస్తే బాగుంటుందో చెప్పండి అని నేరుగా ప్రజలకు ఐవీఆర్ఎస్‌లో ఫోన్‌చేసి అడగను న్నారు. వారి నుంచి సేకరించిన అభిప్రాయాలలో ఎక్కువ మంది వ్యక్తపరిచిన వాటిని ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోనున్నారు.

విశాలాంధ్ర బ్యూరో ఏలూరు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే పథకాలు,చేపట్టే కార్యక్రమాలు, తీసుకునే నిర్ణయాలపై ప్రజాభిప్రాయ సేకరణ ప్రకారం ముందుకు వెళ్లాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ప్రజలకు మెరుగైన,నాణ్యమైన సేవలు అందించేందుకు వారి అభిప్రాయాల మేరకు నడుచుకోనుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఇందుకు అనుగుణంగా ఇకపై ప్రభుత్వం అమలు చేసే పథకాలపై ఐవిఆర్ఎస్ ఫోన్లు చేయడం ద్వారా ఆయా కార్యక్రమాల అమలు తీరును తెలుసుకోనున్నారు.

లబ్దిదారుల నుంచి అభిప్రాయాల సేకరణ...

లబ్దిదారులకు నేరుగా కంప్యూటర్ బేస్డ్ ఫోన్ కాల్స్ ద్వారా ఆ పథకాల వల్ల ప్రయోజనం, దాని అమలు, సేవలలో నాణ్యత వంటి అంశాలపై ఫీడ్ బ్యాక్‌ను ప్రభుత్వం సేకరించనుంది. వాటిపై ప్రజలు ఇచ్చే రేటింగ్ ఆధారంగా ప్రభుత్వం మార్పులు, చేర్పులు చేసుకుని పని చేయనుంది. ఇంటింటికి పింఛన్లు, దీపం పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ వంటి పథకాలకు సంబంధించి ఈ ఫీడ్ బ్యాక్ తీసుకోనున్నారు. పింఛన్లు సక్రమంగా ఇంటి వద్దనే అందు తుందా..? లేదా..?దీపం పథకం ఉచిత గ్యాస్ సిలిండర్ పొందడంలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా...?వంటి ప్రశ్నల ద్వారా లబ్దిదారుల నుంచి అభిప్రాయాలు ▶మిగతా 2లో..

అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి

ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు

విశాలాంధ్ర ఏలూరు: అసంఘటిత రంగంలో పనిచేస్తున్న జట్లు, లాగుడుబండ్ల కార్మికులు, ముఠా కార్మికులకు కేంద్ర ప్రభుత్వం సమగ్ర చట్టం చేయాలని ఏఐటీయూసీ ఏలూరు జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం ఏలూరు మెయిన్ బజార్ జలవాని సెంటర్‌లో ఏలూరు నగర జట్లు, లాగుడుబండ్ల కార్మిక సంఘం (ఏఐటీయూసీ) 54వ వార్షికోత్సవ సభ జరిగింది. ఈ సభకు సంఘం అధ్యక్షులు పుప్పాల కన్నబాబు అధ్యక్షత వహించారు. గత వార్షికోత్సవం నుంచి నేటి వరకు సంఘంలోని సభ్యులు, వ్యాపారస్తులు, మృతి చెందిన వారికి సభ రెండు నిమిషములు మౌనం పాటించి సంతాపం తెలిపింది. గత ఏడాదిగా సంఘ కార్యకలాపాలను సంఘం అధ్యక్షులు పుప్పాల కన్నబాబు వివరించారు. సంఘం బలోపేతానికి సంఘ సభ్యులు, కమిటీ సభ్యులు క్రియాశీలకంగా పనిచేయాలని కన్నబాబు కోరారు. ఈ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక, ప్రజావ్యతిరేక, రైతాంగ వ్యతిరేక విధానాలను ▶మిగతా 2లో..

సీపీఐ శత వార్షికోత్సవాలు

జయప్రదం చేయండి : సీపీఐ

విశాలాంధ్ర -భీమవరం: భారత కమ్యూనిస్టు పార్టీ శత వార్షికోత్సవాలను జయప్రదం చేయాలని సిపిఐ భీమవరం ఏరియా కార్యదర్శి చెల్లబోయిన రంగారావు పిలుపునిచ్చారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) భీమవరం పట్టణ సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో సీపీఐ శత వసంతాల ఉత్సవాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చెల్లబోయిన మాట్లాడుతూ డిసెంబర్ 26 నాటికి భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి నూరు వసంతాలు పూర్తవతా యన్నారు. లాఠీ దెబ్బలుతిని, జైల్లో మగ్గినా, మన దేశానికి సంపూర్ణ స్వాతంత్య్రం కావాలని నినదించి తమ ప్రాణాలను సైతం తృణ ప్రాయంగా విడిచిపెట్టిన పార్టీ సీపీఐ అని కొనియాడారు. స్వాతంత్య్రం అనంతరం భారతదేశంలోని పేద ప్రజలకు భూమి దక్కించడం కోసం దున్నేవాడిదే భూమి అని నినాదాలు ఇచ్చి, లక్షలాది ఎకరాల భూములను ప్రత్యక్ష పోరాటాలు నిర్వహించడం ద్వారా పేద ప్రజలకు పంచిన ఘనత కమ్యూనిస్టు పార్టీ సొంతమని చెల్లబోయిన పేర్కొన్నారు. శత వార్షికోత్సవం పురస్కరించుకుని ప్రజల్లోకి వెళ్లాలని, పార్టీని బలోపేతం చేసే కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎం.లక్ష్మీపతి, వై.వి.ఆనంద్, పాలా త్రిమూర్తులు, పి.యాకోబు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికాభివృద్ధి సాధనలో సూక్ష్మ,చిన్నతరహా పరిశ్రమలు కీలకం

రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్

విశాలాంధ్ర - కాకినాడ, రామచంద్రపురం : సమ్మిళిత ఆర్థిక వృద్ధి సాధనలో సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమలు కీలక భూమిక పోషిస్తాయని రాష్ట్ర కార్మిక శాఖ మాత్యులు వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక వీఎస్ఎం కళాశాల నందు జిల్లా పరిశ్రమల కేంద్రం ఆధ్వర్యంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ఇన్ కోనసీమ పేరిట నిరుద్యోగ యువతీ యువకులకు ఎమ్ఎస్ఎంఇ పరిశ్రమల స్థాపన కై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నిరుద్యోగ యువతీ యువకులు వినూత్న ఆలోచనలతో సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమలు ఏర్పాటుకు ముందుకు వస్తే అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా పరిశ్రమల స్థాపన ఒక ఆచరణీయ వృత్తిగా ఎంచుకునే వారిని అన్ని విధాల ప్రోత్సహించాలన్నారు. నిరుద్యోగ యువత ఆలోచనలకు అనుగుణంగా వారికి ఆసక్తి ఉన్న రంగంలో పరిశ్రమలు నెలకొల్పుకు నేందుకు దరఖాస్తు దగ్గర నుండి రుణాలు కల్పనతో పాటుగా రాయితీలతో ప్రోత్సహిస్తూ పరిశ్రమ స్థాపన దిశగా అన్ని దశలలో పూర్తి సహకారం అందించేందుకు సిబ్బందిని బృందాలుగా నియమించడం జరిగిందన్నారు. చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు విషయంలో అన్ని విధాల సహకరించడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రతి ఇంట్లో ఒక పారిశ్రామిక వేత్త తయారు కావాలన్నదే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆ దిశగా ఒక ప్లాట్ ఫారం మీకు అన్ని విధాల సహకరించేందుకు స్థానికంగా 24/7 అందుబాటులో ఉండే విధంగా మీతో పాటు నడవడానికి సిద్ధంగా ఉండేలా ఏర్పాటు చేయడం జరిగిందని ▶మిగతా 2లో..

సమగ్ర చట్టం చేయాలి

(1వ పేజీ తరువాయి)

వివరించారు. 77 సంవత్సరాల స్వతంత్ర భారతదేశంలో గత ప్రభుత్వాలు అనేక సంస్థలను పరిశ్రమలను ప్రభుత్వ రంగంలో ఏర్పాటు చేస్తే వాటన్నింటిని కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం ప్రైవేటీకరణ చేస్తూ భారతదేశ ఆర్థిక వ్యవస్థను చిన్నా భిన్నం చేస్తుందని ఆయన విమర్శించారు. చివరకు ఆంధ్రకు అతిపెద్ద పరిశ్రమగా ఉన్న విశాఖ ఉక్కు కర్మ గారాన్ని కూడా ప్రైవేటీకరణ చేయుటకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఏఐటీయూసీ పోరాటఫలితంగా సాధించుకున్న 44 కార్మిక చట్టాలను 4 కార్మిక కోడ్లుగా మార్చి కార్మిక హక్కులను మోదీ ప్రభుత్వం హరిస్తుందని వెంకటేశ్వర్రావు విమర్శించారు. రానున్న రోజులలో ఏఐటీయూసీ నిర్వహించే పోరాటాలు ఆందోళనలో జట్టు లాగుడు బండ్ల కార్మిక సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.ఈ సభలో ఏపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి)జిల్లా కార్యదర్శి భజంత్రీ శ్రీనివాసరావు, యూనియన్ సీనియర్ నాయకులు మారిన వెంకట్రావు, కడుపు కన్నయ్య, యూనియన్ కోశాధికారి పెచ్చేటి శ్రీనివాస్, సహాయ కార్యదర్శి ఎస్ సోమేశ్వరరావు, తదితరులు మాట్లాడారు. సభలో యూనియన్ కార్యదర్శి వంగలపూడి గంగరాజు, యూనియన్ నాయకులు గొర్లి అప్పారావు,కరణం సురేష్,సుంకర రాంబాబు,పేచ్చేటి నూకరాజు,కంతం రెడ్డి భాస్కరరావు, యాదగిరి శ్రీను, ఎస్ బాపూజీ,జీ దుర్గారావు తదితరులు పాల్గొన్నారు. యూనియన్ జమా ఖర్చులను కోశాధికారి పి శ్రీనివాస్ ప్రవేశపెట్టగా వార్షిక సభ ఆమోదించింది. యూనియన్ కమిటీ నిర్ణయాలను అధ్యక్షులు కన్నబాబు సభకు వివరించగా సభ ఆమోదించింది.

అసైన్డ్ భూములు కబ్జా...

రెవెన్యూ సభలో వినతి విచారణకు ఆదేశించిన మంత్రి సారథి

ఫైల్ ఫొటో

విశాలాంధ్ర–చాట్రాయి: ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ నాయకులను అంటకాగుతూ సరిహద్దు ప్రాంతంలో అందిన కాడికి ఆక్రమణలు చేస్తున్న ఓవ్యక్తి పద్నా నాలుగు ఎకరాలకు పైగా అసైన్డ్ భూములను ఆక్రమించిన విషయం మంత్రి సారథి దృష్టికి వెళ్లడంతో నిజా నిజాలను నిగ్గు తేల్చాలని రెవెన్యూ అధికారులను ఆదేశించినట్లు తెలుస్తోంది. చాట్రాయి చింతలపూడి మండలాలకు సరిహద్దులు తమ్మిలేరు ప్రాజెక్టును ఆనుకొని వున్న చాట్రాయి మండలం పోతనపల్లి పంచాయతీ మంకొల్లు గ్రామంలో ఎస్.సి.,బీసీలకు చెందిన అసైన్డ్ భూములు తమ్మిలేరు రిజర్వాయర్ ప్రాజెక్టు భూములు ఎంత వీలు కుదిరితే అంత ఆక్రమించుకొని ఏపార్టీ అధికారంలో వుంటే ఆ నాయకుల్ని అడ్డుపెట్టుకుని రెవెన్యూ అధికారులకు పెద్ద ఎత్తున లంచాలు ముట్ట చెప్పి భూములు కబ్జా చేస్తున్న విషయం వెలుగులోకి వస్తున్నట్లు తెలుస్తోంది. భూములు లేకపోయినా వివిధ నెంబర్లలో ఆన్ లైన్ చేయించుకోవడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య అని చర్చించుకుంటున్నారు. విషయమై ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన గ్రామ రెవెన్యూ సభలలో గ్రామస్తులు వినతిపత్రాలు అందించారు.సదరు వ్యక్తితో ఇబ్బందులు పడుతున్న కుటుంబ సభ్యులు సరాసరి మంత్రి సారథికే వినతిపత్రం అందించినట్లు తెలుస్తోంది. స్పందించిన మంత్రి సారథి నిజానిజాలను నిగ్గు తేల్చాలని ఒక వ్యక్తికి అసైన్డ్ భూమి ఎంత ఉండవచ్చు అని సమాచారం సేకరిస్తున్నట్లు తెలిసింది. భూములు నిజంగా కబ్జా జరిగితే ఎవరి భూములు వారికి అప్పగించాలని ఆదేశించినట్లు తెలుస్తోంది.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ వికేంద్రీకరణ

విశాలాంధ్ర ఏలూరు: ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను నేటి నుండి మండల, డివిజనల్, మున్సిపల్ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కె.వెట్రి సెల్వి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, డివిజనల్, మున్సిపల్ స్థాయిలో నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల, డివిజనల్, లేదా మున్సిపల్ కార్యాలయాలలో సమర్పించుకోవచ్చున న్నారు. ప్రజలకి పాలనను మరింత చేరువ చేయడానికి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను ప్రభుత్వం వికేంద్రీకరించినట్లు తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

పరిశ్రమలు కీలకం

(1వ పేజీ తరువాయి)

ఆయన స్పష్టం చేశారు. కొబ్బరి ముడిసరుకు ఆధారంగా 15 రకాల విలువ ఆధారిత వస్తువులను తయారు చేసేందుకు అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గడచిన ఆరు నెలలలో రాష్ట్రంలో పరిశ్రమ స్థాపన కొరకు రూ.1,50,000 కోట్ల పెట్టుబడులను తెచ్చిందన్నారు. పరిశ్రమల స్థాపనలో 35% రాయితీలను అదేవిధంగా పరిశ్రమలకు పెట్టుబడులకు గాను బ్యాంకు నుంచి రుణాలు ఇప్పించడం ద్వారా పరిశ్రమల స్థాపనకు ఇటోదికంగా సహాయ పడటం జరుగుతుందన్నారు. నిరుపేద వితంతువులకు కుట్టు, ఎంబ్రాయిడరీ కుట్టు పరిశ్రమలు నెలకొల్పుకునేందుకు అవసరమైన పెట్టుబడిని తానే సమకూర్చడం జరుగుతుందని హామీ ఇచ్చారు. కోటిపల్లి గ్రామ సమీపంలో 350 ఎకరాలు ప్రభుత్వ పట్టా భూములు ఉన్నాయని పాడి పరిశ్రమపై ఆసక్తి ఉన్న రైతులకు పాడి గేదెల యూనిట్లు కొరకు రుణాలు ఇప్పించి పశుగ్రాసం పెంచుకునేందుకు పట్టా భూమిని, పశు గ్రాస విత్తనాలను ఇవ్వడం జరుగుతుందన్నారు. అరటి పండ్లును సోలార్ డ్రైయర్ ద్వారా విలువ ఆధారికంగా మార్చుకుని లాభాన్ని అర్జించవచ్చునని ఆయన స్పష్టం చేశారు. ప్రతి ఇంట్లో ఓ పారి శ్రామికవేత్తను తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. ప్రభుత్వ సహకారంతో నిరుద్యోగ యువత పారిశ్రామి కవేత్తగా మారటానికి ఈ అవగాహన ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. తద్వారా పారిశ్రామిక రంగానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తుం దన్నారు. సీఎం, డిప్యూటీ సీఎంలు దూర దృష్టితో ఆలోచించి నూతన పారిశ్రామిక విధానానికి శ్రీకారం చుట్టారన్నారు. పరిశ్రమలు ఏర్పాటుకు అనుకూలమైన వాతా వరణం సృష్టించడంతో పాటు ఆర్థిక భద్రత, అన్ని రకాల ప్రోత్సాహకాలు అందిస్తుందన్నారు. ఉద్యం పోర్టల్ ద్వారా తమ వివరాలు నమోదు చేసుకొని ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ అందించే ప్రోత్సాహకాలకు అర్హత సాధించాలని సూచించారు. స్టార్టప్ కంపెనీలు ఏర్పాటు చేసే నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణా కేంద్రాల ద్వారా చేయూత అందిస్తామన్నారు. వినూత్న ఆలోచనలతో ముందుకు రావాలని నిరుద్యోగ యువతకు పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ పరిశ్రమలు ఏర్పాటులో ఎస్సీ, ఎస్టీ, మహిళలకు అదనపు ప్రోత్సాహకాలు ఉంటాయని తెలిపారు. మంత్రివర్యులు ప్రత్యేక చొరవ తీసుకొని స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ఇన్ కోనసీమ పేరిట పరిశ్రమల స్థాపనకు ఎంతగానో కృషి సల్పుతున్నారని ఆ దిశగా నిరుద్యోగ యువత తమ వినూత్న ఆలోచనలతో ఆసక్తిని కనబరిచి ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా జీవన ప్రమాణాలను మెరుగు పరుచు కోవాలని ఆకాంక్షించారు. పరిశ్రమ స్థాపనకు ముందుకు వచ్చే వారికి పెట్టుబడులు అందించడంతో పాటు వారు తయారు చేసిన ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌలభ్యం కూడా కల్పించడం జరుగుతుందన్నారు. ముందుగా నిరుద్యోగ యువత వారికి ఏ రంగంలో ఆసక్తి ఉందో తెలియపరిస్తే ఆ దిశగా టీములు ఆయా రంగ పరిశ్రమల ఉత్పత్తి విధి విధానాలపై అవగా హనను పెంపొందిస్తారని తెలిపారు. నైపుణ్యాలను పరిగణనలో తీసుకుని వాటి ఆధారంగా పరిశ్రమల ఏర్పాటుకు అవకాశాలు నిండుగా ఉన్నాయన్నారు. జిల్లాలో ప్రాథమిక సెక్టార్ అయిన వ్యవసాయ అనుబంధ రంగాలు ఉన్నప్పటికీ రెండో సెక్టార్ పారిశ్రామి కంగా అంతంత మాత్రమే ఉందని ఈఎంఎస్ఎం ఈ ద్వారా మరిన్ని పరి శ్రమలు రావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట శాసనసభ్యులు బండారు సత్యానంద రావు, రెవిన్యూ డివిజన్ అధికారి డి అఖిల, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ పీకేపీ ప్రసాద్, తాసిల్దార్ సావిత్రి, స్థానిక ప్రజా ప్రతినిధులు, వార్డ్ నెంబర్లు పాల్గొన్నారు

ఐవీఆర్ఎస్ (1వ పేజీ తరువాయి)

సేకరించనున్నారు.

నూతన పాలసీల పైనా...!

పథకాలతో పాటు ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన పాలసీల అమలుపైనా ప్రజాభిప్రాయాన్ని ఐవీఆర్ఎస్ ద్వారా సర్కారు తెలుసుకోనుంది. ఉచిత ఇసుక విధానం అమలు, నూతన మద్యం పాలసీ, అమ్మకాలపైన ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించనున్నారు. పథకాలు కార్యక్రమాలతో పాటు రానున్న రోజులలో రెవెన్యూ, మునిసిపల్, విద్యుత్ వంటి అనేక కీలక శాఖలలో ప్రజలు పొందుతున్న పౌర సేవలపై ఐవీఆర్ఎస్ ద్వారా సమాచారం సేకరించనున్నారు. ఈ సమాచారంలో ప్రజలు ఎక్కడైనా అసంతృప్తి వ్యక్తం చేస్తే వాటికి గల కారణాలను విశ్లేషించి సేవలను మరింత మెరుగుపరుస్తారు.

ఉద్యోగులలో బాధ్యత పెంచాలని....

ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులలో బాధ్యత పెంచి మంచి సేవలు ప్రజలకు అందేలా చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రజలు చెప్పిందే ఫైనల్ అనే విషయం ప్రాతిపదికన పనిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రభుత్వం నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌కి ప్రజలు ఓపికగా తమ అభిప్రాయాలు చెప్పాలని కోరారు. ఈ ఫోన్ కాల్స్‌కి ప్రజలు వెచ్చించే ఒకటి రెండు నిమిషాల సమయంతో కూటమి నుంచి ఉత్తమ సేవలు పొందే అవకాశం ఏర్పడుతుందని వివరించారు. దీనికి ప్రజలు తమ వంతుగా సహకరించాలని కోరారు. మంచి పాలనకు, నాణ్యమైన ప్రభుత్వ సేవలు అందించే కార్యక్రమంలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని చంద్రబాబు ఆకాంక్షిస్తున్నారు. ఐవీఆర్ఎస్ విధానం ద్వారా వచ్చే ఖచ్చితమైన అభిప్రాయాలను తెలుసుకోవడంపై గతంలోనూ తెలుగుదేశం ప్రభుత్వం ప్రయోగం చేసింది. అయితే ముఖ్యమంత్రి మెప్పుకోసం కొందరు అధికారులు ప్రజల వాస్తవ అభిప్రాయాలను తెలియనివ్వకుండా జాగ్రత్తపడ్డారు. అంతా బాగుంది అని రీతిలో తప్పుడు సమాచారం ఇచ్చిన సందర్భాలు ఉన్నాయి. అలాంటివి పునరావృతం కాకుండా పటిష్ట వ్యవస్థ ద్వారా దీనిని జరిపితే మరింత ఫలితాలు వస్తాయని అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

రేషన్ బియ్యం పై సర్వే...

కిలో రూపాయికి పేదలకు బియ్యం పంపిణీ చేస్తున్న విషయం తెలిసిందే. ఈ బియ్యాన్ని తీసుకెళుతున్న లబ్దిదారుల్లో సగానికి పైబడి వీటిని తినడం లేదు. బియ్యం వ్యాపారులకు రూ.12 నుంచి రూ.15 చొప్పున అమ్మేస్తున్నారు. ఈ బియ్యమే ఇప్పుడు కాకినాడ, గంగవరం పోర్టుల నుంచి ఇతర ప్రాంతాలకు తరలిపోతున్నాయి. బియ్యం పొందుతున్న వారిలో అత్యధికశాతం మంది వాడటం లేదన్న విషయం ప్రభుత్వంలో ఉన్న ప్రజాప్రతినిధులు, అధికారులకు తెలుసు. కానీ ఏం చేయలేని పరిస్థితి. తెల్ల రేషన్ కార్డు ఉన్న వారందరికీ వీటిని సరఫరా చేయాలి. ఈ కార్డు బిపిఎల్ కు సూచిక. దీని అనుసరించే సంక్షేమ పథకాలతో పాటు ప్రభుత్వం నుంచి అందుతున్న వివిధ రకాల రాయితీలు, ఉద్యోగ, ఉపాధిలో రిజర్వేషన్లను అమలు చేస్తుండడంతో ఈ కార్డులను ప్రతి ఒక్కరు పొందేందుకు చూస్తున్నారు. ఎలాంటి ద్రవపత్రం కావాలన్నా దీనిని అడుగుతున్నారు. వరుసగా మూడు నెలలు బియ్యం తీసుకోకుంటే ఈ కార్డు రద్దు అయ్యే అవకాశం ఉండడంతో అవసరం లేని వారు కూడా తీసుకుంటున్నారు. మాకెందుకు ఈ బియ్యం, ఈ కార్డును పథకాలకు ముడిపెట్టకుండా ఉంటే చాలని అనేవారు చాలామంది ఉన్నారు. ఐవీఆర్ఎస్ సర్వే ద్వారా రేషన్ బియ్యం అవసరం లేని వారంతా ఈ విషయం చెప్పేందుకు అవకాశం ఉంది. తద్వారా ఈ పథకంలో మార్పులు చేర్పులు చేసేందుకు అవకాశం ఉంటుంది.

ముగిసిన జ్ఞాన జ్యోతి శిక్షణా తరగతులు

విశాలాంధ్ర – ఏలూరు: స్థానిక సుబ్బమ్మదేవి మున్సిపల్ హై స్కూలులో జిల్లా రిసోర్స్ పర్సన్‌లకు మూడు రోజులుగా జరుగుతున్న ఎఫ్ఎల్ఎన్ జ్ఞానజ్యోతి 120 రోజుల శిక్షణా కార్యక్రమం ఆదివారంతో విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా డిఇఓ ఎం వెంకట లక్ష్మమ్మ మాట్లాడుతూ ఎఫ్ ఎల్ ఎన్ జ్ఞానజ్యోతి 120 రోజుల శిక్షణ కార్యక్రమం సమగ్ర శిక్ష, ప్రథం సంస్థలు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో చదివే మూడు నుంచి ఎనిమిది సంవత్సరాల పిల్లలకు వారి శారీరక, మానసిక, భావోద్వేగ, భాషలకు సంబంధించిన అంశాలను అభివృద్ధి పరచాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహిస్తూ ఉందన్నారు. ఇక్కడ శిక్షణ పొందిన డీఆర్పీలు క్షేత్రస్థాయిలో అంగన్వాడీ కార్యకర్తలకు మరింత అర్థవంతంగా శిక్షణ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో 146 మంది డిఆర్పిలు,ఏలూరు డి వై ఈ ఓ ఎ. రవి ప్రకాష్,సమగ్ర శిక్ష ఎంఐఎస్ కోఆర్డినేటర్ వి రమేష్, ఏఎంఒ రెడ్డి రామారావు, కేఆర్పిలు అబ్దుల్ అజీజ్,షేక్ ఫరీదా, నూరాణి, తులసి,విజయలక్ష్మి,కమల్ కుమార్, ముషబ్బర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మ్యాథ్స్ డే...

విశాలాంధ్రబి ఏలూరు: పెదపాడు హై స్కూలులో జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. వెంకటేశ్వర్రావు అధ్య క్షతన గణిత ఉపాధ్యాయులు విద్యార్థులకు గణితంలో పలు అంశాలపై పోటీలు నిర్వహించి బహుమతులను అందజే శారు. తొలుత భారతదేశ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మ్యాథ్స్ డే అక్షరాల రూపంలో విద్యార్థులు ఒదిగి కూర్చున్న దృశ్యం అందర్నీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఉపాధ్యాయ,ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఐ శత వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించాలి: నెక్కంటి

విశాలాంధ్ర నర్సాపురం: సీపీఐ 100 సంవత్సరాల వేడుకలను ఘనంగా నిర్వహించాలని సీపీఐ నరసాపురం నియోజకవర్గ కార్యదర్శి నెక్కంటి క్రాంతి కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం మండలలో మల్లవరం లంక, సరిపల్లి గరువు పార్టీ శాఖ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న నెక్కంటి క్రాంతి కుమార్ మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వాడవాడలా సీపీఐ పతాకాలు ఆవిష్కరించాలని తెలిపారు. సీపీఐ పార్టీ అభివృద్ధికి సభ్యత్వం సకాలంలో చెల్లించాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మల్లవరం శాఖా కార్యదర్శి దిడ్ల శేఖర్, సరిపల్లిశాఖ కార్యదర్శి యనమదుర్తి నాగేశ్వరావు, గాది యేసు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విలేకరిపై మూకుమ్మడి దాడి

విశాలాంధ్ర- పాలకోడేరు : పాలకోడేరు మండలం మోగల్లు గ్రామానికి చెందిన చిల్లా ప్రసాద్ బాబు సాక్షి దిన పత్రికకు విలేకరుగా పనిచేస్తున్నారు. అదే గ్రామంలో నూతనంగా గృహం నిర్మించు కుంటున్న సమయంలో పక్కనే ఉన్న సమీప బంధువులైన చిల్లా రత్నం రాజు, చిల్ల రమేష్ స్థలానికి సంబంధించిన విషయంలో గతంలో గొడవ చేశారు. ఈ విషయం పెద్దలలో పరిష్కారం చేశారు. అయి నప్పటికీ సదరు బంధువులైన చిల్లా రత్నం రాజు, చిల్లా రమేష్ అదును చూసి ఎలాగైనా గొడవ పెట్టుకోవాలని ఉద్దేశంతో శుక్రవారం సాయంత్రం చిల్లా ప్రసాద్ బాబు డ్యూటీ ముగించుకొని ఇంటికి వెళ్ళగా అప్పటికే అక్కడ పొంచి ఉన్న చిల్లా రత్నం రాజు, చిల్లా రమేష్, చిల్లా ఝాన్సీ మూకుమ్మడిగా దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన ప్రసాద్ బాబు భీమవరం ప్రభుత్వ ఆసుపత్రిలో జాయిన్ కావడంతో శనివారం రాత్రి ఆసుపత్రి నుండి సమాచారం పాలకోడేరు పోలీసులకు అందజేశారు. సమాచారం అందుకున్న స్టేషన్ రైటర్ బి. నాగరాజు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక మీడియా వారికి తెలియజేశారు.

పారిశుధ్య కార్మికుల ధర్నా

విశాలాంధ్ర -జంగారెడ్డిగూడెం: ఏపీ మెడికల్ కాంటాక్ట్, ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా పిలుపులో భాగంగా మూడో రోజు ఆదివారం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రి శానిటరీ వర్కర్స్, సెక్యూరిటీ సిబ్బంది హాస్పిటల్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని, కాంట్రాక్టు ఏజెన్సీని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ వేతనాలు ఇవ్వాలని మూడు రోజులుగా విధులు నిర్వహిస్తూ భోజన విరామ సమయంలో తమ నిరసనలో భాగంగా ధర్నా నిర్వహించడం జరిగిందని, ఒకటి రెండు రోజుల్లో తమ సమస్యలు పరిష్కరించకుండా ఉంటే పారిశుధ్య కార్మికులు నిరవధిక సమ్మెకు దిగుతారని ఆయన హెచ్చరించారు. చాలీచాలని వేతనాలతో కడు దుర్భరమైన పరిస్థితి ఎదుర్కొంటున్న పారిశుధ్య కార్మికులకు, ప్రభుత్వానికి ఏజెన్సీల పేరిట దళారుల వ్యవస్థను కొనసాగించడం సహేతుకము కాదని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పారిశుధ్య కార్మికులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో ఒకటైన కాంట్రాక్ట్ ఏజెన్సీను తొలగించి ప్రభుత్వమే ఔట్సోర్సింగ్ ఉద్యోగు లుగా పరిగణించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆసు పత్రిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు ప్రభుత్వం నుంచి వారి శ్రమకు ఎంత వేతనం వస్తుందో తెలియని అయోమయ పరిస్థితిలో కార్మికులు ఉన్నారని ఆయన అన్నారు. కాంట్రాక్టర్ దయాదాక్షిణ్యాలపై కార్మికుల జీవితాలు ఆధారపడి ఉన్నాయన్న విధంగా పరిస్థితి ఉందని,ఇది సరికాదన్నారు. ఇప్పటికైనా కార్మికులకు జీతాలు చెల్లించలేని అసమర్ధ కాంట్రాక్ట్ ఏజెన్సీ వెంటనే రద్దు చేయాలని, ఆయన డిమాండ్ చేశారు. క్రిస్మస్, జనవరి ఫస్ట్, సంక్రాంతి పండుగలను పరిగణనలోకి తీసుకొని కార్మికులకు ఇవ్వవలసిన పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేకుంటే ఒకటి రెండు రోజుల్లో జిల్లా వ్యాప్తంగా ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు నిరవధిక సమ్మెకు దిగుతారని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీ యూసీ జిల్లా సహాయ కార్యదర్శి కూనపాముల విగ్నేష్, ఏఐటీయూసీ గౌరవా ధ్యక్షులు జంపన వెంకట రమణ రాజు, ఏఐటీయూసీ మండల కార్యదర్శి కుంచె వసంతరావు, లొట్టి వెంకటేశ్వరరావు మేరీ, దయామని, సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ వైద్య సేవలు గుర్తించాలి : ప్రసాద్

విశాలాంధ్ర - కుక్కునూరు: మారుమూల గ్రామాల్లో అందుబాటులో ఉంటూ రోగులకు అత్యవసరమైన వైద్య సేవలు అందిస్తూ ప్రాణాలు కాపాడానికి గ్రామీణ వైద్యుల చేసే ప్రథమ చికిత్స ఎంతో ముఖ్యమని కుక్కునూరు మండల గ్రామీణ వైద్యుల వెల్ఫేర్ అషోషియేషన్ అధ్యక్షుడు కొంగా దైవా ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం కార్యదర్శి ఎస్ కె.చాంద్ పాషా ఆధ్వర్యంలో గ్రామీణ వైద్యుల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా దైవ ప్రసాద్ మాట్లాడుతూ గ్రామాల్లో రోగులకు సమయానికి చికిత్స చేసి ఎందరో ప్రాణాలు కాపాడుతున్న గ్రామీణ వైద్యుల సేవలను ప్రభుత్వం గుర్తించాలని కోరారు. ప్రభుత్వం తరుపున గ్రామీణ వైద్యులకు శిక్షణ ఇచ్చి వారి సేవలను మెరుగుపరచాలని తెలిపారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలతో గ్రామీణ వైద్యులకు ప్రాధాన్యత కల్పించాలని కోరారు.ఈ సదస్సుకు 30 మంది గ్రామీణ వైద్యులు హాజరయ్యారు.ఉపాధ్యక్షులు ఏ.వెంకటరమణ,ట్రెజరీ సభ్యులు మునుగడ. నాని,ముఖ్య అతిథులు కుక్కునూరు మండల జనసేన అధ్యక్షుడు ములిశెట్టి యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ ఉత్పత్తులపై రైతులకు అవగాహన ఉండాలి : సుబ్బారావు

విశాలాంధ్ర-లింగపాలెం: రైతులు వ్యవసాయ ఉత్పత్తుల ను పెంచడంలో ఉత్పత్తిదారుల సంఘ సంస్థ ద్వారా రైతులకు ప్రయోజనం కలిగించే అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు ఈసంస్థ మేనేజరు సుబ్బారావు వెల్లడించారు. సంస్థ మొదటి వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని లింగపా లెంలో జరిగిన కార్యక్రమంలో సంస్థ చేపడుతున్న అనేక కార్యక్రమాలను ఆయనతో పాటు సంస్థ కోఆర్డినేటర్ కాళేశ్వరరావు వివరించారు. వ్యవసాయంపై ఆధారపడే రైతులు నష్టాలు బారిన పడకుండా ఉండేందుకు, శ్రమకు తగ్గ ఫలితం పొందేందుకు సంస్థ సహకారం అందిస్తుందని వివరిం చారు. రైతులు ఉత్పత్తులను పెంచే విషయంలో నాణ్యత ప్రమాణాలు లేకపోవడం వల్ల నష్టాలు బారిన పడుతున్నారని అటువంటి పరిస్థితులు లేకుండా సంస్థ చర్యలు తీసుకుం టుందని వెల్లడించారు. పరిశ్రమలు పెట్టుకునేందుకు రైతులకు సహకారం అందిస్తామని రైతులు వీటిని సద్విని యోగించు కోవాలని కోరారు. వ్యవసాయమే ప్రధాన జీవనాధారంగా గ్రామీణ ప్రాంతాలలో ఉన్న రైతులకు తమ సంస్థ పూర్తిస్థాయిలో సహకారం అందిస్తుందని పేర్కొన్నారు. సమావేశంలో బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ మారంపూడి మల్లికార్జున రావు, సంస్థ సీఈఓ సామ్యూల్ ప్రాజెక్టు సభ్యులు చెన్ను శ్రీనివాసరావు, ఉప్పు వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

ముమ్మరంగా నారుమడులు

విశాలాంధ్ర- పాలకోడేరు : పాలకోడేరు మండలంలో రబీ సీజన్ కి సంబంధించి మండల వ్యాప్తంగా 11,500 ఎకరాలలో వరి సాగు చేయుటకు రైతులు సిద్ధమవుతున్నట్లు మండల వ్యవసాయ అధికారి వి. నారాయణరావు ఒక ప్రకట నలో తెలియజేశారు. ఇప్పటికే మోగల్లు, వేంద్ర, కోరుకొల్లు, గరగపర్రు మరియు కొన్ని గ్రామాల్లో రైతు సోదరులు నారు మడులు సిద్ధం చేసుకుంటున్నట్లు తెలిపారు. రెండు మూడు రోజుల్లో పూర్తిస్థాయిలో ఖరీఫ్ ధాన్యం మాసుళ్లు పూర్తవుతాయని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. పట్టుబడిన ధాన్యం కూడా రైతులకు డబ్బులు 48 గంటల్లోనే జమ అవుతూ అవుతూనట్లు తెలిపారు.

చింతలపూడి మార్కెట్ చైర్మన్ పదవి ఎవరికి?...

పదవి కోసం పెదబాబు అభిమానుల ప్రయత్నాలు...

విశాలాంధ్ర లింగపాలెం: చింతలపూడి నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీలో కీలక నాయకుడిగా ఉన్న లింగపాలెం మండలానికి చెందిన పెదబాబుకు చింతలపూడి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఇవ్వాలనే అంశాన్ని ఆయన అభిమానులు తెరమీదకు తెస్తున్నారు. తెలుగుదేశం పార్టీలో నియోజకవర్గంలోనే కాక, జిల్లా స్థాయిలో కీలకమైన నాయకుడిగా ఆయనకు గుర్తింపు ఉంది. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడే కాక ప్రతిపక్షంలో ఉన్న సమయంలోనూ, ఎన్నికల సమయంలో ఆర్థికంగా తమ వంతు సహకారాన్ని పార్టీకి అందిస్తూ వస్తున్నారు. పార్టీ అధిష్టానం దృష్టిలో ఈయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. లింగపాలెం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా 20 ఏళ్లకు పైగా పనిచేశారు. 2014లో లింగపాలెం జడ్పీటీసీగా గెలుపొందారు. ప్రస్తుతం రాష్ట్ర స్థాయి రైతు విభాగంలో నామినేటెడ్ పోస్టులో ఉన్నారు. వివాద రహితుడిగా గుర్తింపు ఉన్న ఆయనకు మంచి పదవి ఇవ్వాలని ఆయన అనునాయులు కోరుతున్నారు. చింతలపూడి మార్కెట్ కమిటీ పదవికి డిమాండ్ అధికంగా ఉంది. ఈ పదవి కోసం అనేకమంది నాయకులు పోటీ పడుతున్నారు. పోటీపడే నాయకులు పార్టీ అధిష్టానం వద్ద తమ పలుకుబడిని ఉపయోగించి పదవి పొందేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. తెలుగుదేశం పార్టీలోనే కాక, కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్యంగా ఉన్న జనసేన పార్టీ నాయకులు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి తమ పార్టీకే ఇవ్వాలని ఈ పార్టీ నాయకులు కోరుతున్నారు. వీరి ప్రయత్నాలు ఇలా ఉంటే సీనియర్ నాయకుడైన పెదబాబుకు ఈ పదవి ఇవ్వటం వల్ల ఈయన కష్టానికి తగిన ఫలితం ఉంటుందని ఈయన అభిమానులు భావిస్తున్నారు. ఈయనకు ఈపదవి ఇవ్వటం వల్ల పార్టీలో పెద్దగా విభేదాలు ఉండవని మరెవరికీ ఇచ్చినా గ్రూపులు ఏర్పడే ప్రమాదం ఉంటుందని పలువురు భావిస్తున్నారు. తెలుగుదేశం పార్టీలో ఆపద్బాంధవుడుగా పేరున్న పెదబాబు పదవులు కోసం ఆశ పడరని ఈయన సేవలను గుర్తించి అధిష్టానం పదవిని అప్పగించాలని ఈయన అనుచరులు కోరుతున్నారు. పార్టీలో పెదబాబుకు ఉన్న పలుకుబడితో నామినేటెడ్ పదవులు పొందటం పెద్ద కష్టమేమీ కాదని మార్కెట్ కమిటీ చైర్మన్ ఇవ్వటం వల్ల చింతలపూడి నియోజకవర్గంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఇయన వర్గీయులు అంటున్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ పదవికి పెదబాబు పేరు తెరపైకి రావటంతో చర్చ మొదలయింది. పెదబాబు సేవలను గుర్తించి అధిష్టానం ఈయనకే ఈ పదవి ఇస్తుందా? లేదా? అనే దానిపై సర్వత్రా చర్చనీయాంశంగా ఉంది.

ఆ మలుపు ప్రమాదాలకు పిలుపు

విశాలాంధ్ర- పాలకోడేరు : పశ్చిమగోదావరి జిల్లాలోని పి పి రోడ్డులో గల పాలకోడేరు మండలం విస్సాకోడేరు, గోరగనమూడి గ్రామాల మధ్య రైస్ మిల్ సమీపంలో అతి ప్రమాదకరమైన మలుపు ఉండడంతో తరచూ ప్రమాదాలు జరుగుచున్నవి. ఈ గ్రామాలు జిల్లా ప్రధాన కేంద్రమైన భీమవరానికి అతి సమీపంలో ఉన్నవి. పైగా ఇది 165వ నెంబర్ గల జాతీయ ప్రధాన రహదారి. నిత్యం ఈ ప్రధాన రహదారిపై వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది.ఈ మలుపు వద్ద ఏ విధమైన స్పీడ్ బ్రేకర్లు గాని, హెచ్చరిక బోర్డులు గాని లేకపోవడం గమనర్హం. కొన్ని సందర్భాలలో ఈ మలుపులలో ప్రమాదాలు సంభవించి ప్రాణాలు కోల్పోయిన వారు కూడా లేకపోలేదు. అధికార యంత్రం స్పందించి ఆర్ అండ్ బి అధికారులను మేల్కొలిపి ఆ మలుపు వద్ద స్పీడ్ బ్రేకర్లు, ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుచున్నారు.

స్త్రీలను గౌరవించడం మన బాధ్యత : ఎస్సై

విశాలాంధ్ర ప్రతినిధి-ఏలూరు : సమాజంలో పురుషుల తో పాటు స్త్రీలను సమానంగా గౌరవించాల్సిన బాధ్యత అందరిపై ఉందని మహిళా పోలీస్‌స్టేషన్ ఎస్ఐ కాంతిప్రియ పిలుపునిచ్చారు. ఏలూరులోని విద్యానగర్ ప్రాంతంలో శ్రీ చైతన్య పాఠశాలలో నిర్వహించిన ఛేటీ సమాన్-రెస్పెక్ట్ దగర్ల్స్ కార్యక్రమాన్ని పాఠశాల ప్రిన్సిపాల్ దుర్గారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై కాంతి ప్రియను పాఠశాల యాజమాన్యం దుశ్శాలువాతో సన్మానించింది. ఈ సందర్భంగా ఎస్సై కాంతిప్రియ విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడుతూ నేటి సాంకేతిక యుగంలో పాఠశాల దశ నుంచే విద్యార్థులకు గుడ్ టచ్ - బాడ్ టచ్‌ల గురించి యాజమాన్యాలు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సమాజంలో రోజు రోజుకు మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు గురించి వివరించడంతో పాటు విద్యార్థినులను అప్రమత్తం చేసి జాగ్రత్తలు పాటించేలా చైతన్య పరచాలన్నారు. అదేవిధంగా మహిళలు, బాలికల సంరక్షణకు ప్రభుత్వం అమలు చేస్తున్న చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. విద్యార్థినులు అవసరం మేరకే సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. అనవసరంగా ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్, ఇతర సామాజిక మాధ్యమాలను వినియోగించవద్దని సూచించారు. ఏలూరు జిల్లాలో ఎంతో ప్రతిష్టాత్మకంగా మహిళ అభయ రక్షక దళం అమలు చేస్తున్నట్లు వివరించారు. ఈ బృందం ప్రతి రోజు ఏలూరు నగరంలో సంచరిస్తూ మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించే వారిపై, వేధింపులకు గురి చేయడం, ర్యాగింగ్‌కు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎవరైనా మహిళలు, బాలికలు ఇబ్బందులకు గురి చేస్తే వెంటనే 112 లేదా 1930 నెంబర్లకు ఫోన్ చేస్తే పది నిమిషాల వ్యవధిలో మహిళా రక్షక దళం అక్కడకు చేరుకొని ఆకతాయిల ఆగడాలకు కళ్లెం వేస్తుందని భరోసా ఇచ్చారు. పాఠశాల ప్రిన్సిపాల్ దుర్గారావు మాట్లాడుతూ అనాదిగా ఆడపిల్లలను గౌరవించటం మన సాంప్రదాయమని, దానిని భవిష్యత్ తరాలు కొనసాగించాలని సూచించారు. బాధ్యతతో ముందడుగు వేసి, సమాజ శ్రేయస్సుకు అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. పశ్చిమగోదావరి జిల్లా ఏజియమ్ ఎన్.పార్థసారథి, ఏలూరు రీజినల్ 'ఇంఛార్జ్ సిహెచ్ ఉదయభాస్కర్, అకడమిక్ కో-ఆర్డినేటర్ వెంకటేశ్వరరావు, డీన్ లక్ష్మణ్ కుమార్, ఐపిఎల్ ఇన్చార్జి ఎన్. సత్యనారాయణ, ప్రైమరీ ఇన్‌ఛార్జి అరుణ, ప్రీ ప్రైమరీ ఇంచార్జ్ ఝాన్సి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్

విశాలాంధ్ర , జీలుగుమిల్లి : ఏసుక్రీస్తు బోధనలు మానవాళికి ఎంతో ఉపయోగపడతాయని ముఖ్య ప్రసంగికులు ప్రముఖ సైకాలజిస్ట్ భలే చిన్న బాబు అన్నారు .శనివారం రాత్రి కామయ్యపాలెం గ్రామంలో షాలోమ్ ప్రేయర్ హౌస్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసుక్రీస్తు శిలువ మరణం పాపులను రక్షించి పరిశుద్ధులుగా ఉన్న సంఘం కొరకు రెండవ రాకడలు రాబోతున్నారని విశ్వాసులు ఆయన రాకడ దినానికి పరిశుద్ధులుగా వుండాలన్నారు. ముందుగా సండే స్కూల్ విద్యార్థులు ఏసుక్రీస్తు గీతాలాపనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సంఘ సేవకురాలు ఎన్ మేరీ కేక్ కట్ చేసి అందరికీ సెమీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. సంఘ సేవకుడు పాస్టర్ ఎన్ శామ్యూల్ హ్యాపీ క్రిస్మస్ ,మేరీ క్రిస్మస్ అంటూ తన ఉపన్యాసంతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో సేవకులు కండెల్లి శేఖర్, ఎస్ శ్రావణ్ కుమార్, ఎం తిమోతి, నెహ్రూ, గద్దం చిట్టి వెంకటరావు, నక్కరాజు, కుప్పల వెంకటేశ్వరరావు, ఎన్ చంద్రశేఖర్, పి రామకృష్ణ, హేమ దుర్గారావు, చల్లా నాగమణి ,పి చంద్ర వెంకటలక్ష్మి తో పాటు సుమారు 400 మంది విశ్వాసులు పాల్గొన్నారు.

రామానుజన్ సేవలు చిరస్మరణీయం

విశాలాంధ్ర-భీమడోలు: భారతదేశ గణిత ఘనాపాటి, గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ గణితంలో చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు కొనియాడారు. భీమడోలు శాఖ గ్రంథాలయంలో ఆదివారం శ్రీనివాస రామానుజన్ 138వ జయంతిని పురస్కరించుకుని జాతీయ గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్, పెద్దలు ఎం. సుబ్రహ్మణ్యంలు మాట్లాడుతూ చిన్న వయసులోనే అసాధారణ ప్రతిభ కలిగిన బాలుడిగా గుర్తింపు పొందారన్నారు. ప్రతి ఒక్కరి జీవితం గణితంతో ముడిపడి ఉందని, విద్యార్థి దశ నుంచి గణితం పట్ల ఆసక్తి కలిగి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని తెలిపారు. అనంతరం చదవడం మాకు ఇష్టం కార్యక్రమాన్ని నిర్వహించడమైనది. వివిధ ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు సామూహిక పుస్తక పఠనం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథ పాలకుడు కే శ్రీనివాస్,పెద్దలు మోహన్ రావు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నిధులు దుర్వినియోగంపై విచారణ పూర్తి

విశాలాంధ్ర-టి నరసాపురం: బొర్రంపాలెం పంచాయితీలో నిధులు దుర్వినియోగంపై విచారణ పూర్తి అయినట్లు జంగారెడ్డిగూడెం డీఎల్పీపిఓ ఎండి రజావుల్లా తెలిపారు. బొర్రంపాలెం గ్రామంలో విచారణ పూర్తైన సందర్భంగా ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల బొర్రంపాలెం గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త గుండె పాండురంగ పంచాయితీలో నిధులు దుర్వినియోగంపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ఫిర్యాదు చేయడంతో జిల్లా కలెక్టర్ విచారణకు ఆదేశించారు. నెల రోజులు విచారణ చేసి నిధులు దుర్వినియోగం అయినట్లు గుర్తించి బాధ్యులపై చర్యలు చేపట్టి దుర్వినియోగం అయిన నిధులు వెనక్కి రాబట్టవలసిందిగా జిల్లా పంచాయితీ అధికారికి సిఫారసు చేస్తూ నివేదిక పంపినట్లు ఆయన తెలిపారు.

రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-టి నరసాపురం: రైతులు రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలని తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి తోట లక్ష్మీనారాయణ తెలిపారు. తిరుమల దేవిపేట గ్రామంలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం భూ సమస్యలు స్థానికంగా పరిష్కారానికి గ్రామ స్థాయిలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. గ్రామ స్థాయిలో దారి సమస్యలు, లాండ్ ఎక్విటేషన్ వంటి అనేక సమస్యలు పరిష్కరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సాయి బాబా, రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ ప్రవంతి, సీనియర్ అసిస్టెంట్ హరిబాబు, పెంటా రావు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల అభివృద్ధికి కృషి

విశాలాంధ్ర, జీలుగుమిల్లి : పి అంకంపాలెం, కామయ్యపాలెం పంచాయతీలలో మంచి నాణ్యతతో సీసీ రోడ్లు పూర్తి చేయనున్నట్లు పి అంకంపాలెం ఎంపీటీసీ నాలి శ్రీను తెలిపారు. ఆదివారం కామయ్యపాలెంలో సీసీ రోడ్ల నిర్మాణాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ప్రతి గ్రామాలలో సీసీ రోడ్లు పోసిన ఘనత ఈ ప్రభుత్వానికి ఉందని అన్నారు. దశలవారీగా ఇచ్చిన హామీలను ఈ ప్రభుత్వం అమలు చేస్తుందని అన్నారు. కామయ్యపాలెం పంచాయతీలు 1200 మీటర్లు సీసీ రోడ్లు పోయాల్సి ఉండగా ఇప్పటివరకు 900 మీటర్లు పోయడం జరిగిందని తెలిపారు. మిగిలిన రోడ్లు మూడు రోజులలో పూర్తి చేయనున్నట్లు అన్నారు. పార్టీలకతీతంగా ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు వేయడం జరుగుతుందని అన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుక

విశాలాంధ్ర -పాలకోడేరు : పాలకోడేరు మండలం మోగల్లు గ్రామంలో సండే స్కూల్ పిల్లలకు క్రిస్మస్ వేడుకలు దైవజనుల ఆధ్వర్యంలో ఆదివారం జరిగాయి. ఈ వేడుకలలో ముఖ్యంగా పిల్లలు జీసెస్ పాటలతో, నృత్యాలతో అలరించారు. ఈ సందర్భంగా పాస్టర్స్ మాతాలాడుతూ శాంతి కోసం జీసెస్ యేసుక్రీస్తు తన ప్రాణాన్ని అర్పించారు అని ప్రతి ఒక్కరు క్షమా గుణాన్ని కలిగి ఉండాలన్నారు. అనంతరం ప్రేమ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం లో బ్రదర్ పి. రాజేష్ పాల్, దాలి, జార్జి ముల్లర్, గోపి, సాల్మాన్ రాజు సండే స్కూల్ టీచర్ వై. రాజి, ఆసాపు రాజు, చంద్రబాబు, కాలేబు పాల్గొన్నారు.

రామానుజన్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

విశాలాంధ్ర-టి నరసాపురం: విద్యార్థులు శ్రీనివాస రామానుజన్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని ఆంధ్ర ప్రదేశ్ గురుకుల విద్యాలయాల రిటైర్డ్ రీజనల్ డిప్యూటీ శక్రటరీ డి సి వెంకయ్య తెలిపారు. అప్పలరాజు గూడెం గురుకుల పాఠశాలలో శ్రీనివాస రామానుజన్ జన్మదినాన్ని పురస్కరించుకొని దొమ్మేటి ఫౌండేషన్ ఫౌండర్ ప్రిన్సిపాల్ డిఎస్‌బి శంకరరావు ఆర్థిక సాయంతో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీనివాస రామానుజన్ విగ్రహాన్ని ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ భారత దేశం కీర్తిని ప్రపంచ గణితశిఖరాలపై ఎగుర వేసిన మహానుభావుడు రామానుజన్ అన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ప్రిన్సిపాల్ రాజేంద్ర ప్రసాద్, ఉపాధ్యాయులు కిషోర్ కుమార్, కె శ్రీనివాస రావు, అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు అమలుచేయాలి :సీపీఐ

విశాలాంధ్ర -భీమవరం: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో తాత్సారం చేయకుండా వెంటనే ఆ ప్రక్రియ ప్రారంభించాలని సీపీఐ భీమవరం రూరల్ మండల కార్యదర్శి ఎం.సీతారాం ప్రసాద్ అన్నారు. ఆదివారం ఆయన సీపీఐ నాయకులతో కలిసి మాట్లాడుతూ అధికారం చేపట్టి ఆరు నెలలుగడుస్తున్నా కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో వెనుకంజవేస్తుందని ధ్వజమెత్తారు. రేషన్ కార్డులు, పెన్షన్లు విషయంలో రోజుకో మాట చెబుతూ నాన్చడం సరికాదని ప్రభుత్వంపై ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు తీసుకు వెళుతుందని ఆయన అన్నారు. ఎందరో రేషన్ కార్డులు, పెన్షన్ల కోసం ఎదురు చూస్తుంటే ఇది నిరాశ అవుతుందని ఆయన అన్నారు. మహిళకు ఉచిత బస్సు హామీ ఇంతవరకు అమలు కావడం లేదని ప్రభుత్వం ఎప్పటికైనా ప్రజల్లో వ్యతిరేకత రాకముందే కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు మల్లుల శ్రీనివాస్, కె.వి.బ్రహ్మం పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కుల పరిరక్షణకు విస్తృత ప్రచారం

విశాలాంధ్ర -భీమవరం: వినియోగదారుల హక్కుల పరిరక్షణకు వాడవాడల విస్తృత ప్రచారం నిర్వహించాలని, ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని ఆర్ఆర్‌డిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.కె.జె. ప్రసూన పిలుపునిచ్చారు. జాతీయ వినియోగదారుల దినోత్సవం వారోత్సవాల్లో భాగంగా కళాశాల కన్స్యూమర్ క్లబ్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వినియోగదారుల హక్కులను కాపాడటానికి అనేక చట్టాలున్నాయని, ఎన్నో సంస్థలు పనిచేస్తున్నాయని వివరించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వినియోగదారుల హక్కులపై వ్యాసరచన, వక్తృత్వం పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ పి.అరవింద్ స్వామి, డాక్టర్ కాకుమాని శ్రీనివాసరావు, డాక్టర్ రాజశేఖర్, ఎల్.నరసిం హారావు, చిన సత్యనారాయణ, జి.ఉమామహేశ్వరి, పి.అమూల్య రావు, సిబ్బంది , విద్యార్థులు పాల్గొన్నారు.

రెవెన్యూ సిబ్బంది విధులకు ఆటంకంపై పిర్యాదు

విశాలాంధ్ర - సీతానగరం : మండలంలో ముగ్గళ్ళ గ్రామ పంచాయితీ పరిధిలో అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తు న్నారు అనే పిర్యాదులు మేరకు తహసిల్దార్ శ్రీనివాస్ రెవెన్యూ సిబ్బందికి ర్యాంపులో విధులు కేటాయించారు. అయితే దీనిలో భాగంగా సల్లొండ గ్రామ విఆర్ఏ బదంపూడి ముసలయ్య ఆదివారం ఉదయం విధులు నిర్వహిస్తుండగా అదే గ్రామానికి చెందిన పెనుగులు లక్ష్మణరావు అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తుండగా ఆపమని ప్రశ్నించగా వాగ్వివాదం దిగి అసలు నీవు ఎవరు నన్ను ప్రశ్నిం చడానికి అని తోసేవేశాడు. కావున పై అధికారులు ఆదేశాల మేరకు విధులు నిర్వహిస్తున్న నా మీద దౌర్జన్యం చేసినందుకు కేసు నమోదు చేయాలని వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో వి ఆర్ ఓ చిన్నారావు, వి ఆర్ ఏలు పాల్గొన్నారు.

రాజకీయాలకతీతంగా దేవతల ఉత్సవాలు

విశాలాంధ్ర - అనపర్తి : రాజకీయాలకతీతంగా దేవతల ఉత్సవాలు జరగాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు.ఆదివారం సంక్రాంతికి జరిగే స్థానిక వీరుళ్ళమ్మ,కుతుకులూరు శ్రీ భక్తాంజనేయ స్వామి జాతర,తీర్థం పురస్కరించు కొని ఎమ్మెల్యే నల్లమిల్లి రాట మంచి చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలందరూ కలిసికట్టుగా నడవాలని, ప్రజల మధ్య వైరుధ్యాలను రూపుమాపాలనే ఉద్దేశంతో గ్రామ దేవతల ఉత్సవాలను ఏర్పాటు చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కొవ్వూరి శ్రీనివాసరెడ్డి (దత్తుడు శ్రీను), సిరసపల్లి నాగేశ్వరరావు,కర్రి వెంకటరామారెడ్డి,ఓగిరెడ్డి రాధ,సత్తి దేవదాన రెడ్డి, సత్తి వెంకట రామారెడ్డి, మేడపాటి వెంకట రమణారెడ్డి, సత్తి రామకృష్ణారెడ్డి ఇంకా పలువురు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలి

విశాలాంధ్ర - కడియం : కడియం మండల మహిళా సమాఖ్య ఆఫీసులో పిడీడీఆర్డీపి, కడియం యంపిపి ఆదేశాలతో యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయంఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో 30 మంది మహిళలకు కొవ్వొతుల శిక్షణ తయారీ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సంస్థ డైరెక్టర్ తాడి శ్రీనివాస్ మాట్లాడతూ శిక్షణ కార్యక్రమంలో నేర్చుకున్న విషయాలు సాధన ద్వారా దైనందిన జీవితంలో ఉపయోగించుకొని, ఆర్థికంగా అభివృద్ధి చెందాలని పేర్కొన్నారు. మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదిగేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న శిక్షణ ఎంతో దోహదపడుతుందని తెలిపారు. అనంతరం వారికి సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపియం మూర నాగ భూషణం, శిక్షకురాలు ఖాదిర్ బీ, సిసి పద్మారావు, కొండేటి ప్రసాద్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

సువర్ణవేణికి శ్రీ మాతృ ఫౌండేషన్ "భారతరత్న" పురస్కారం

విశాలాంధ్ర - కడియం : కర్ణాటక లోని శ్రీ మాతృ ఫౌండేషన్ సంస్థ వివిధ రంగాలలో ఉత్తమ సేవలు అందించిన వారికి ఇచ్చే "భారతరత్న" సేవా పురస్కారం 2024కు తూర్పుగోదావరి జిల్లా, కడియం మండలం, కడియం గ్రామం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న డాక్టర్ బూసి సువర్ణవేణికి ప్రకటించారు. డిసెంబర్ 22వ తేదీ, ఆదివారం బెంగళూరులో అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో మాతృశ్రీ ఫౌండేషన్ సంస్థ చైర్మన్ ప్రేమ్ లత, యురేకా ఫోర్బ్స్ సభ్యురాలు లాకేష్, హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ వైస్ చైర్మన్ డాక్టర్ వినోద్ శ్రీవత్సవ, గోవర్ధన్ దిశల్ ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా కడియం పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్య నారాయణ, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

కళలకు, క్రీడలకు వేదిక రాజమహేంద్రవరం

విశాలాంధ్ర - రాజ మహేంద్రవరం రూరల్ : రాష్ట్రాన్ని క్రీడాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం కృతనిజంతో ఉందని శాప్ చైర్మన్ రమనాయుడు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక మున్సిపల్ స్టేడియంలో ఆయన రాజమండ్రి రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చి చౌదరితో కలిసి స్టేడియం ను పరిశీలించారు. అనంతరం శాప్ చైర్మన్ రమనాయుడు మీడియాతో మాట్లాడుతూ రాజమహేంద్రవరం కళలకు, క్రీడలను వేదికగా ఉండాలని ఆనాటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ ఆలోచన అన్నారు. ఆ మేరకు స్థానిక సీనియర్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చియ్య చౌదరి గారు రాజమహేంద్రవరంలో క్రీడలను ప్రోత్సహించే దిశగా కార్యాచరణ రూపకల్పన చేసి గత టిడిపి ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు. రాజమండ్రి రూరల్ శాసనసభ్యుడు గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ రాజమండ్రి నడిబొడ్డున ఉన్న స్టేడియం అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంసి, డి.ఈ, కె. సత్యనారాయణ, తూర్పు గోదావరి జిల్లా కబడ్డీ సంఘం కార్యదర్శి బురిడీ.త్రిమూర్తులు శ్రీనివాస్ కోశాధికారి .కుమార్ .ఏలీయా వీరబాబు సుధాకర్ జయకుమార్ తూర్పుగోదావరి జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం కార్యదర్శి నాగరాజు కోశాధికారి .వీరబాబు ఎ. డి ప్రసాద్ వై.వెంకటేశ్వరరావు ఫుట్బాల్ జిల్లా సంఘ కార్యదర్శి గంగాధర్ రావు జిల్లా కబడ్డీ క్రీడాకారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చెక్కుల పంపిణీ

విశాలాంధ్ర - రాజానగరం : తరగతి గదుల్లో ఉన్నత ప్రతిభ కనబరిచిన పలువురు పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు చెక్కులను అందజేశారు. మండల కేంద్రమైన రాజానగరంలోని కరికాల భక్తులు సంఘం నేతృత్వంలో శ్రీ భ్రమరాంభ మల్లిఖార్జున కరికాల భక్త అన్నదాన సత్రం, సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా కరికాల కులానికి చెందిన పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు పంపిణీ చేశారు. దీనిలో భాగంగా 17 మందికి విద్యాప్రోత్సాహం చెక్కులను, ముగ్గురికి వైద్య సహాయం చెక్కులను పంపిణి అందజేశారు. ఒక్కరికీ ఐదు వేలు చొప్పున మొత్తం ఒక లక్ష ఆరు వేల రూపాయల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండర్ కమిటీ చైర్మన్ పాలాడి బాలమోగి, అధ్యక్షులు కామాడి లక్ష్మణరావు, కార్యదర్శి కర్రెళ్ళ ముక్తేశ్వరరావు, సంక్షేమ సంఘం అధ్యక్షులు మోటుపల్లి కాశీ విశ్వేశ్వ రావు, సెక్రటరీ భూమాడి మల్లిఖార్జునరావు, కోశాధికారి బాబు ప్రసాద్, పి.వీర్రాజు, సంఘనాయకులు పాల్గొన్నారు.

మద్యం దుకాణం తరలింపు అర్జీపై విచారణ

విశాలాంధ్ర - సీతానగరం: మండలంలో సీతానగరం గ్రామంలో శెట్టి బలిజ పేటలో మద్యం దుకాణం ఏర్పాటు పై కొద్ది రోజులు క్రితం అక్కడ ఉన్న మహిళలు మద్యం దుకాణం వల్ల మాకు రక్షణ లేదు అని నిరశన తెలిపి పిర్యాదు చేశారు. దీనిపై ఆదివారం ఎక్సైజ్ ఎస్ఐ శ్రీనివాస రావు, విఆర్ఓ రమేష్ మద్యం దుకాణం చుట్టు పక్కల ఉన్న మహిళలను విచారణ చేసి నివేదిక నమోదు చేసుకున్నారు. దీనిలో అదే వీధిలో ఉన్న కొంత మంది మహిళలు ఈ మద్యం దుకాణం వల్ల ఇబ్బంది లేదు అని చెప్పగా అదే వీధిలో మరికొందరు మహిళలు ఇబ్బందిగా ఉందని నివేదిక ఇచ్చారని సమాచారం. ఇంతటితో విచారణ పూర్తి కాలేదని తదుపరి విచారణ జరుగుతుందని అన్నారు..

చింతపల్లి సతీష్‌కు రజక సంఘ నాయకుల సన్మానం

విశాలాంధ్ర - కొవ్వూరు : రజక సంఘం సభ్యులు ఐక్యతతో సమాజంలో ముందుకు వెళ్లాలని ధర్మవరం గ్రామానికి చెందిన రజక కార్పొరేషన్ డైరెక్టర్ చింతపల్లి సతీష్ కుమార్ తెలిపారు. మంగళగిరి టీడీపీ కార్యాలయంలో రజక సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ సమావేశంలో సతీష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి గుంటూరు టిడిపి ఎమ్మెల్యే మాధవి, ఎమ్మెల్సీ రామారావు, తదితర రజక సంఘం నాయకులు భారీగా పాల్గొన్నారు. తదుపరి రజిక కార్పొరేషన్ డైరెక్టర్ చింతపల్లి సతీష్‌కు సన్మానం చేశారని ఆయన తెలిపారు.

రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబుకు ఘనస్వాగతం

విశాలాంధ్ర - రాజానగరం : రాజ్యసభ సభ్యుని హోదాలో తొలిసారిగా కాకినాడ వెళ్లేందుకు వచ్చిన రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబుకి తెలుగు తమ్ముళ్లు అధిక సంఖ్య లో విచ్చేసి రాచమర్యాదలు చేశారు. భారత పార్లమెంటులోని రాజ్యసభలో ఏపీ నుండి తెలుగుదేశం పార్టీ తరుపున రాజ్య సభ సభ్యునిగా ఏకగ్రీవంగా ఎన్నికైన సానా సతీష్ బాబు ఇటీవలే ప్రమాణస్వీకారం చేసిన సంగతి పాఠకులకు విదితమే. ప్రమాన స్వీకారం అనంతరం డిల్లి నుండి రాజానగరం నియోజకవర్గంలోని మధురపూడి విమానాశ్రయానికి రాజ్యసభ సభ్యుని హోదాలో ఆదివారం చేరుకున్నారు. మార్గ మధ్యలో రాజానగరం లోని జాతీయ రహదారిలోని కలవచర్ల కూడలి వద్దకు వచ్చేసరికి కాకినాడ రూరల్ కో- కోర్డినేటర్ కటకంశెట్టి వెంకట సత్య ప్రభాకర్(బాబీ) ఆధ్వర్యంలో,పత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఆధ్వర్యంలో, రాజమహేంద్రవరం నుండి వినోద్ ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో,గంధం పల్లంరాజు యూత్, ఆధ్వర్యంలో తెలుగు తమ్ముళ్లు అధిక సంఖ్యలో స్వాగతం పలికారు. పలువురు వ్యాపారవేత్తలు, రాజకీయ ప్రముఖులు శుభాకంక్షలు చెప్పారు. అరాజానగరం నుండి జగ్గంపేట చేరుకొని అక్కడ నుండి కాకినాడ తరలి వెళ్లనున్నట్లు కాకినాడ రూరల్ కో- కోర్డినేటర్ కటకంశెట్టి వెంకట సత్య ప్రభాకర్ (బాబీ) చెప్పారు. సుమారు 60 కిలో మీటర్లు మేరకు కార్లు, బైకులతో రాజసభ్య సభ్యులు సానా సతీష్ వెంట ర్యాలీగా వెళ్లనున్నారు. రాజానగరం వద్ద జాతీయ రహదారి పై ట్రాఫిక్ భారీగా స్తంభించింది. దీంతో రాజానగరం సీఐ ఎస్.ప్రసన్న వీరయ్య గౌడ్,ఎస్ఐ కె.వెంకట నాగా ర్జున,ట్రాఫిక్ పోలీసులు నేతృత్వంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ, కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్, గౌడ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టరు మట్ట ప్రకాష్ గౌడ్,కాకినాడ రూరల్ మండల అధ్యక్షులు సీతయ్య దొర,జిల్లా 93 బీసీ కులాల ప్రధాన కార్యదర్శి మునసా అప్పారావు, టీడీపీ నాయకులు మందరపు చిట్టిబాబు, కర్రి శ్రీను,కాకరాపల్లి చలపతిరావు, గుల్లపల్లి శ్రీనివాస్, వీరభద్రరావు, వాసంశెట్టి సత్తిబాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాసవిక్లబ్ చైర్మన్‌కు ఉత్తమ అవార్డు

విశాలాంధ్ర - కొవ్వూరు : జిల్లా వాసవి క్లబ్ జిల్లా గవర్నర్ వలివేటి ప్రసాద్‌కు ఉత్తమ గవర్నర్‌గా అవార్డు లభించింది. కొవ్వూరు చెందిన ఈయన సాయిరాం సంస్థల అధినేతగా కొనసాగుతున్నారు. విశాలాంధ్ర విలేఖరికి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవే నినాదంగా వాసవి క్లబ్ 1961 లో ప్రారంభమైందన్నారు. ఈ నేపథ్యంలో పశ్చిమగోదావరి జిల్లాలోని అన్ని మండల హెడ్ క్వార్టర్స్‌లో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ముఖ్యంగా పర్యావరణ పరిరక్షణకు సీడ్ బాల్స్ ను రెండు లక్షలతో వివిధ మున్సిపాలిటీలు గ్రామాల్లో ఈ బాల్స్ కార్యక్రమాన్ని నిర్వహించమన్నారు. రెండో ప్రాధాన్యత కార్యక్రమం లో భాగంగా విద్యార్థులకు పుస్తకాలు ఇతర అవసరమైన వస్తువులను అందించి వారిని భావితరాల భవిష్యత్తు తీర్చి దిద్దడానికి అనేక చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లావ్యాప్తంగా అనేక కార్యక్రమాలు నిర్వహించి సేవే నినాదంగా తమ క్లబ్ పనిచేస్తుందన్నారు. మానవసేవే మాధవ సేవ, జై వాసవి నినాదాలతో తమ క్లబ్ ముందుకు వెళుతుందన్నారు.

సానా సతీష్‌కు ఏలేశ్వరం ఎంపీపీ స్వాగతం

విశాలాంధ్ర - ఏలేశ్వరం : రాజ్యసభ సభ్యుడిగా ఎన్నిక కాబడి మొట్టమొదటి సారిగా కాకినాడ జిల్లాకి విచ్చేసిన సానా సతీష్‌బాబు ను కాకినాడ జిల్లా ఎంపీపీల సమైక్య అధ్యక్షుడు, ఏలే శ్వరం మండల అధ్యక్షుడు గొల్లపల్లి బుజ్జి మధుర పూడి విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికి ఆయ నను దుస్సాలువాతో సత్కరించారు. అక్కడ నుండి ర్యాలీగా బయలుదేరి మురారి, గండేపల్లి, జగ్గంపేట మీదుగా ఎర్రవరం వరకు వెళ్లి ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభతో

జగ్గంపేటలో రాజ్యసభ ఎంపీకి స్వాగతం

విశాలాంధ్ర - జగ్గంపేట : రాజ్యసభకు ఎంపిగా ఎన్నికైన సానా సతీష్ బాబుకు ఆదివారం జగ్గంపేటలో స్వాగతం పలికారు. ఆయన మధురపూడి విమానాశ్ర యం నుండి హైవే మీదుగా జిల్లాకు చేరుకున్నారు. రాజానగరం, గండేపల్లి మీదుగా జగ్గంపేటకు చేరుకోవడంతో హైవే పై జేవియర్ జంక్షన్ వద్ద కూటమి నేతలు పూల మాలలు, శాలువాలతో స్వాగతం పలికి సత్కరించారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రు, టిడిపి కాకినాడ జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్, జనసేన పార్టీ నియోజకవర్గ ఇంచార్జి తుమ్మలపల్లి రమేష్, టిడిపి నేతలు తోట నవీన్, ఎస్వీ ఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, దేవరపల్లి మూర్తి తదితర నాయకులు, జనసైనికులు మొగిలి గంగాధర్, ఉలిసే ఐరాజ్, నాయకులు పాల్గొన్నారు.

శ్రీనివాసలో గణిత శాస్త్ర దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - కాట్రేనికోన : చెయ్యేరు శ్రీనివాస అటానమస్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రఖ్యాత భారతీయ గణిత శాస్త్రజ్ఞుడు శ్రీనివాస రామానుజన్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల జరిగిన జాతీయ గణిత శాస్త్ర జయంతోత్సవ కార్యక్రమమును కళాశాల ప్రిన్సిపాల్ డా ఎం శ్రీనివాస కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన అధ్యక్షోపన్యాసం చేస్తూ సర్వ శాస్త్రములకు వన్నె తెచ్చేన శ్రీనివాస రామానుజన్ విద్యార్థి దశనుండే గణిత శాస్త్ర అభిరుచి కల్గి వుండి 120 గణిత సిద్ధాంతాన్ని ఆవిష్కరించారన్నారు. 30 సం.ల వయస్సులోనే ఎన్నో గణిత సమస్యలని పరిష్కరించి నెంబర్ థియరి ద్వారా ప్రత్యేక గుర్తింపు సాధించి భారతదేశానికి ఎనలేని ఖ్యాతి తెచ్చి పెట్టారన్నారు. రామానుజన్ క్షయ వ్యాధిని బారిన పడి 32సం.వయస్సులోనే 1920లో మరణించారని, అటువంటి గణిత మేధావి సిద్ధాంతాలని నేటి యువతరమునకు ఒక దిక్సూచి వంటివని శ్లాఘించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డివిఎస్ఎస్ వర్మ, పాలక వర్గ సభ్యులు సందీప్, కళాశాల విద్యాశాఖాధికారిణి జయలక్ష్మి, కళాశాల గణిత శాస్త్ర అధ్యాపకులు, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అమిత్ షా క్షమాపణ చెప్పాలి

కాట్రేనికోనలో దిష్టిబొమ్మ దగ్ధం

విశాలాంధ్ర - కాట్రేనికోన : కేంద్ర హోంశాఖ మంత్రిగా బాధ్యతాయుతమైన పదవిలో ఉండి చట్టసభలను సృష్టించిన, ప్రపంచమేధావి, భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్‌ను ఏకవచనంతో సం బోధి స్తూ పార్లమెంట్లో అవహేలన చేసిన అమిత్ షా వెంటనే దేశ ప్రజలకు క్షమాపణచెప్పాలని కాట్రేనికోన మాలమహానాడు జేఏసీ డిమాండ్ చేసింది. భారత రాజ్యాంగ సృష్టికర్తను అవమానించడం తగదని కాట్రే నికోన మాలమహానాడు జెఏసి నాయకులు ఆదివారం గేట్ సెంటర్లో అంబేద్కర్ విగ్రహం సాక్షిగా అమిత్ షా వ్యతిరేకంగా నినాదాలు చేసి ఆయన దిష్టిబొమ్మను తగలపెట్టారు. ఈ కార్యక్రమంలో దళితనాయ కుడు నల్లా నరసింహమూర్తి, జగడం బాలయోగి, వడ్డీ శ్యాంప్రసాద్, అయితాబత్తుల శ్రీనుబాబు, అయితాబత్తుల పండు బాబు, కాశి భరత్, వజ్రపు శరత్, నందిక శ్రీను, బాల పృధ్వి, బూసి రాంబాబు, గుత్తాల వరప్రసాద్, కాశి రోడ్స్, గజినీ తదితరులు పాల్గొన్నారు.

పివి రావు ఆశయాలతో ఉద్యమాన్ని నడిపిస్తాం

విశాలాంధ్ర - మామిడికుదురు : మామిడికుదురు సెంటర్లో మండల మాల మహానాడు ఆధ్వర్యంలో ఆదివారం పివి రావు 19 వర్ధంతి నిర్వహించారు. పివి రావు చిత్రపటానికి ఉద్యమ నాయకులు భూపతి వెంకటపతి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాధన సమితి జిల్లా వ్యవస్థాపకులు నల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ఆయన ఆశయాలతో ఉద్యమాన్ని ముందుకు నడిపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జాలెం సుబ్బారావు, కలిగితి పల్లంరాజు, బొంతు మణిరాజు తదితరులు పాల్గొన్నారు.

రవాణా శాఖ మంత్రికి ఎమ్మెల్యే బండారు ఘన స్వాగతం

విశాలాంధ్ర - రావులపాలెం : తన పర్యటనలో భాగంగా రావులపాలెం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి విచ్చేసిన రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, కెవి సత్యనారాయణ రెడ్డి, గుత్తుల రాంబాబు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మంత్రి రాంప్రసాద్ రెడ్డి ప్రభుత్వ పథకాల అమలుపై తన అభిప్రాయాలు వెల్లడించారు. అనంతరం ప్రజా సమస్యలను ఎమ్మెల్యే సత్యానందరావు మంత్రికి వివరించారు. మంత్రి స్పందిస్తూ వాటి పరిష్కారానికి పూర్తి సహాయసహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు మంత్రికి తమ అభినందనలు తెలిపారు. సమావేశంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై చర్చలు జరిగాయి. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. అనంతరం మంత్రి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. పర్యటన విజయవంతంగా ముగిసింది.

యుటిఎఫ్ ఆలమూరు మండల అధ్యక్షుడిగా శ్రీనివాసరావు

విశాలాంధ్ర - ఆలమూరు : యుటిఎఫ్ ఆలమూరు మండల అధ్యక్షునిగా అద్దరి శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. యుటిఎఫ్ మండల సమావేశం యుటిఎఫ్ హోమ్‌లో ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంఎఇఒ భమిడిపాటి అప్పాజీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. యుటిఎఫ్ క్యాలెండర్, డైరీ, పదోతరగతి మోడల్ టెస్ట్ పేపర్లను ఆయన ఆవిష్కరించారు. టెస్ట్ పేపర్స్ తయారు చేసిన యుటిఎఫ్‌ను ఆయన అభినందించారు. అనంతరం యుటిఎఫ్ మండల నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. గౌరవ అధ్యక్షునిగా దాసరి నాగేశ్వరరావు, అధ్యక్షునిగా అద్దరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా బొంతు లోకేష్, సహాధ్యక్షులుగా జిజె పుత్రకుమార్, సిహెచ్ఎస్‌విజి శ్యామల, కోశాధికారిగా బిఎన్ మూర్తితో పాటు 12 మంది సభ్యులతో నూతన కార్యవర్గం ఎన్నికైంది. ఈ కార్యక్రమంలో వైవిఐ.రమణ, జివిఎస్ఎస్ జోగేశ్వరరావు, పివివిజిఎన్ఎన్ మూర్తి, ఇ రమేష్, అద్దరి శ్రీనివాసరావు, బి లోకేష్, కెవిఆర్ బాపూజీ, జి భాస్కర్‌రెడ్డి, జి ప్రకాశం, అబ్బులు పాల్గొన్నారు.

నిర్మాణరంగానికి "హెరీమ్ ఎక్స్పో" అద్భుత వేదిక

విశాలాంధ్ర - కాకినాడ : క్రెడయ్ కాకినాడ శాఖ ఆధ్వర్యంలో జనవరి 24 నుండి మూడు రోజులపాటు అరవ "హెరీమ్ ఎక్స్పో"ప్రదర్శనను స్థానిక ఎస్సార్ఎంటి ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు క్రెడయ్ కాకినాడ శాఖ అధ్యక్షులు విజయకృష్ణ తెలిపారు. ఆదివారం స్థానిక క్రెడయ్ కార్యాలయంలో ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా విజయకృష్ణ మాట్లాడుతూ ఈ ప్రదర్శనలో సుమారు 72 స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నామని, ఇందులో బిల్డింగ్ మెటీరియల్స్, ప్రాపర్టీస్ మరియు హెరీమ్ లోన్స్ తాలూకు వివిధ స్టాల్స్ వుంటుందన్నారు. హెరీమ్ ఎక్స్పో" ద్వారా ప్రజలకు అవగాహన కార్యక్రమంతో పాటు నిర్మాణరంగంలో ఎదురౌతున్న సమస్యల పరిష్కారానికి ఆయా సంస్థలకు చెందిన నిపుణులు పలు సూచనలు చేస్తారని వివరించారు. ఆధునిక టెక్నాలజీని కూడా అందుబాటులోకి తీసుకురావడం ద్వారా గృహనిర్మాణ దారులకు సహాయ సహకారాన్ని కూడా అంద చేస్తారని తెలిపారు. గృహ నిర్మాణానికి కావలసిన అన్ని వస్తువులు నాణ్యతకు అధిక ప్రాధాన్యత ఇస్తారని చెప్పారు. దేశంలోని ప్రముఖ కంపెనీలకు చెందిన ఉత్పత్తులు ప్రదర్శనలో ఏర్పాటు చేస్తున్నారని, ఈ ప్రదర్శన ద్వారా ప్రజలకు అవగాహన కల్పించడానికి ఉత్తమమైన వేదికగా విజయకృష్ణ వివరించారు. ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. క్రెడయ్ కాకినాడ శాఖ ప్రధాన కార్యదర్శి టీవీ రమణారావు, క్రెడయ్ రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షులు జివిఎస్‌టి రాయుడు, కాకినాడ శాఖ ఉపాధ్యక్షులు చక్రధరరావు, కోశాధికారి రాంబాబు, పూర్వపు అధ్యక్షులు వివిఎస్ ప్రసన్న, ఎన్ఎస్ బలరాం, కార్యవర్గ సభ్యులు శ్రీనివాసరావు, ఎస్ రాంబాబు పాల్గొన్నారు.

గేమ్ చేంజర్ ప్రీ రిలీజ్ లైవ్ షో

-సందడి చేసిన గబ్బర్ సింగ్ కమిడియన్స్

-ఆలయానికి రూ.10,77,777 విరాళం

విశాలాంధ్ర - జగ్గంపేట : మండలంలోని కాట్రావులపల్లి గ్రామానికి చెందిన కల్లేపల్లి రాజేష్ లండన్‌లో జరిగిన గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ గేమ్ చేంజర్ మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్ లైవ్ షోను సీతానగరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కుడా చైర్మన్ తుమ్మల రామస్వామి, జగ్గంపేట జనసేన ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ హాజరయ్యారు. ఈ లైవ్ షోలో గబ్బర్ సింగ్ చిత్రంలో నటించిన విలన్ కమిడియన్స్ సందడి చేశారు. ఈ సందర్భంగా గేమ్ చేంజర్ మూవీ గ్రాండ్ సక్సెస్ అవ్వాలని రాజేష్ గ్రామంలోని వెంకటేశ్వర స్వామి ఆలయానికి రూ.10,77,777లను విరాళాన్ని ప్రకటించారు. ఆ మొత్తాన్ని ఆయన కుటుంబ సభ్యులు, తుమ్మల బాబు, రమేష్ ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. అలాగే కాట్రావులపల్లిలో సీసీ కెమెరాలు ఏర్పాటుకు సహకరించాలని పోలీసులు కోరడంతో వాటికి అయ్యే రూ.5 లక్షల ఇస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అభిమానులు, జనసేన కార్యకర్తలు హాజరయ్యారు.

వృద్ధులకు నిత్యావసరాల పంపిణీ

విశాలాంధ్ర - పెదపూడి,అనపర్తి : రైజింగ్ హాండ్స్ ఫర్ హోప్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో అనపర్తి తేతలి రామిరెడ్డి మంగయ్యమ్మ మహిళా వృద్ధాశ్రమంలోని మహిళలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఆదివారం ఆధ్యాత్మిక సేవకురాలు స్వర్గీయ సిహెచ్ సూకరత్నం తృతీయ వర్ధంతి సందర్భంగా చింతా వీర్రా ఘవ రెడ్డి (సిరి) ఆర్థిక సౌజన్యంతో వృద్ధులకు బియ్యం, ఇతర నిత్యావసర వస్తు వులు పంపిణీ చేశారు. ఈ కార్యక్ర మంలో సీనియర్ పాత్రికేయులు శ్రీనివాసరెడ్డి, ఆదిరెడ్డి పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు నిత్యావసర వస్తువుల పంపిణీ

విశాలాంధ్ర - కపిలేశ్వరపురం : మండలంలోని అంగర గ్రామంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు నిత్యావసరుకులు పంపిణీ అంగర గ్రామానికి చెందిన కొంపెల్ల రాంబాబు శర్మ, అంగర గ్రామ జనసేన పార్టీ ఉపాధ్యక్షులు తోరాటి శ్రీను సౌజన్యంతో అంగర పంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు పంపిణీ చేశారు. గ్రామ ఉపాధ్యక్షులు తోరాటి శ్రీను మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ సేవలను స్ఫూర్తి గా తీసుకుని ఇటువంటి సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, కార్య కర్తలు, పిల్లా బసవరాజు, తోరాటి శ్రీను, కొంపెల్ల రాంబాబు శర్మ, దానేటి శరత్, శ్రీను పాల్గొన్నారు.

జనసేన సభ్యత్వ చెక్కులు అందజేత

విశాలాంధ్ర - ఆలమూరు : కార్యకర్తల సంక్షేమం కోసం, వారి కుటుంబాల క్షేమం కోసం ఆలోచించే పార్టీల్లో జనసేన ముందుంటుందని కొత్తపేట జనసేన ఇన్చార్జ్ బండారు శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. ఆయన ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రమైన ఆలమూరులో జనసేన కార్యాలయం వద్ద జనసేన సభ్యత్వ చెక్కులను అందజేశారు. ఇటీవల ప్రమాద వశాత్తు గాయపడి కోలుకుంటున్న జనసైనికులు పెట్ట రంగనాథ్‌కు రూ.32 వేలు, చిన్నం వీరబాబుకు రూ.50 వేల చెక్కులను బండారు శ్రీనివాస్ అందజేశారు. వీరిరువురి చేత క్రియాశీలక సభ్యత్వ నమోదు చేయించిన వాలంటీర్లు, మండల ప్రధాన కార్యదర్శి బైరిశెట్టి రాంబాబు, శిరిగినీడి పట్టాభిలను బండారు శ్రీనివాస్ అభినందించారు. జనసేన లక్ష్యాలు, సిద్ధాంతాలు ప్రజల్లోకి తీసుకువెళ్లడానికి అవిశ్రాంతంగా కృషి చేస్తున్న కార్యకర్తలను ఆదుకోవడమే జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో మండల జనసేన అధ్యక్షులు సురపరెడ్డి సత్య, చింతలూరు నీటి సంఘం అధ్యక్షులు గారపాటి శ్రీనివాస చౌదరి, నాగిరెడ్డి వెంకటేశ్వరరావు, సలాది జయప్రకాష్ నారాయణ, కొత్తపల్లి నగేష్, పడాల అమ్మిరాజు, డిపి రావు, చల్లా వెంకటేశ్వరరావు, చల్లా బాబి, సిరిగినీడి పట్టాభి, కట్ట రాజు, కంఠంశెట్టి చంటి, బండారు బాబి, కుడిపూడి ప్రసాద్, నాగిరెడ్డి తాతారావు, రాజాని సుబ్రమణ్యం, పసుపులేటి సాయిబాబా నాయకులు పాల్గొన్నారు.

బడుగు శ్రీకాంత్‌కు ఘన సత్కారం

విశాలాంధ్ర - సామర్లకోట : గౌడ కార్పొరేషన్ డైరెక్టర్‌గా బాధ్య తలు స్వీకరించిన బడుగు శ్రీకాం త్‌ను ప్రముఖ సిద్ధాంతి. చీమల కొండ ప్రసాద్ ఆధ్వర్యంలో అభి నందన సభ ఏర్పాటు చేసి ఘనం గా సత్కరించారు. శ్రీకాంత్ ఇంటి వద్ద నుండి మేళ తాళాలతో వేద మంత్రో చ్చారణతో పండితులు పురాతన సత్తెమ్మ ఆలయం వద్దకు తీసుకుని వచ్చి వేదికపై ఆసీనులను చేశారు. చీమల కొండ ప్రసాద్ సాలువా కప్పి ఘనంగా సత్కరించి శ్రీకాంత్ సేవలను కొనియాడారు. ఈ కార్య క్రమంలో అడబాల కుమారస్వామి బిక్కిన సాయి సత్తెమ్మ తల్లి ఆలయం వద్ద పరిసర ప్రాంతాల్లో ఉన్న ఉన్న పలువురు ప్రముఖులు పాల్గొని శ్రీకాంత్‌ని అభినందించారు.

అమిత్ షాను మంత్రి పదవి నుంచి తొలగించాలి

- ఘనంగా పీవీ రావు వర్ధంతి
- మాల మహానాడు డిమాండ్

విశాలాంధ్ర - అమలాపురం : అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో మాల మహానాడు వ్యవస్థాపకులు స్వర్గీయ పివి రావు 19వ వర్ధంతి కార్యక్రమం మాలమహానాడు నాయకులు ఆధ్వర్యం లో స్థానిక క్లాక్ టవర్ వద్ద నిర్వహించారు. పీవీ రావు చిత్రపటానికి పూలమాలలు వేసి మాల మహానాడు నాయకులు, పీవీ రావు అభిమానులు ఘన నివాళులు అర్పించారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేకం గా పోరాడిన యోధుడు పీవి రావు అని, ఆయన ఆశయసాధన కోసం కృషి చేస్తామన్నారు. పీవి రావు అడుగు జాడల్లో పయనించి వర్గీకరణను అడ్డుకుంటామని మాల మహానాడు నాయకులు తెలిపారు. అనంతరం అంబేద్కర్ పై అనుచిత వాక్యాలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యలు ఖండిస్తూ నిరసన ర్యాలీ చేపట్టారు. అంబేద్కర్ కల్పించిన రాజ్యాంగం వల్లే టీ అమ్ముకునే నాకు ప్రధాని పదవి వచ్చిందంటూ చెప్పిన ప్రధాన మంత్రి మోదీ అంబేద్కర్ మీద నిజంగా ప్రేమ ఉంటే అమిత్ షాను వెంటనే పదవీనుండి తొలగించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో దేశవ్యాప్తం గా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అమిత్‌షాకో హటావో...సంవిధాన్ బచావో "అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పెయ్యల శ్రీనివాసరావు, పెయ్యల పరశురాముడు, జల్లి శ్రీనివాసరావు, నాతి శ్రీనివాసరావు, మట్టా వెంకట రావు,పెనుమాల చిట్టిబాబు, గన్నవరపు శ్రీను, కాశి వెంకట రావు, పోతుల నాగరాజు, గిడ్ల వెంకటేశ్వరరావు, బొంతు రాజేంద్ర, సాపే బాల రవి, వైస్ ఎంపీపీ వడ్డి గంగ బొంతు సత్యనారాయణ, పరమట రాంప్రసాద్, ఎంపీటీసీ మాకె కృష్ణ మూర్తి, గోసంగి సంపద రావు, ఉండ్రు వెంకటేశ్వరావు, నందిక శ్రీను, ఎంపీటీసీ నెల్లి ప్రసాద్, సాపే ధర్మరాజు, పినిపే ప్రకాష్, పోతుల అప్పారావు, గెద్దాడ బుద్ధ రాజు, గెల్లా రాజేంద్ర ప్రసాద్ పందిరి శ్రీను, సరెళ్ల రామకృష్ణ, ముత్తాబత్తుల రాంబాబు, బొంతు శ్రీను, మెండి డేవిడ్ అంబేద్కర్, ఏమ్ఎస్ఎన్ కాశిరాంబోధి, ఈవి సత్యరాయణ, బళ్ళసత్యనారాయణ, పోతుమూడి రవి, రొక్కాల నాగేశ్వరరావు, పరమట నాని, సాపేరమేష్, బుడితి సోమరాజు, అయితాబత్తుల సత్యనారాయణ, పీవీ రావు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి ఇంజనీరింగ్ లో "జాతీయ గణిత దినోత్సవ" వేడుకలు

విశాలాంధ్ర - గండేపల్లి : స్థానిక సూరంపాలెం ప్రగతి ఇంజనీరింగ్ కళాశాల మ్యాథ్మేటిక్స్ క్లబ్ వారు 22 ఆదివారం గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ 137వ జన్మదినోత్సవం సందర్భంగా తమ కళాశాల విద్యార్థులకు వివిధ అంశాల పై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్లు నిర్వహించి వారిలో ప్రతిభకనపరచిన విద్యార్థిని, విద్యార్థులకు బహుమతులు అందజేశారని కళాశాల చైర్మన్ డా పరుచూరి కృష్ణారావు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్‌వి హరనాథ్ బాబు (డైరెక్టర్), ఎమ్ సతీష్, వైస్ ప్రెసిడెంట్), డా కె సత్యనారాయణ (డైరెక్టర్ ఆకాడమిక్స్), డా జి నరేష్ (ప్రిన్సిపాల్), డా పివిఎస్ మాచిరాజు, డీన్‌ఆర్‌డి, వివిధ విభాగాధిపతులు, ఉపాధ్యాయులు, క్లబ్ మెంబర్లు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీనివాస రామానుజన్ జయంతి

విశాలాంధ్ర - ఏలేశ్వరం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రఖ్యాత గణితశాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని గణిత శాస్త్ర విభాగాధిపతి కే సురేష్ ఆధ్వర్యంలో జాతీయ గణిత శాస్త్ర దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి సునీత అధ్యక్షత వహించి గణిత శాస్త్రం మానవాళి నిత్య జీవితంలో ఎంతో ప్రాధాన్యత సంతరించుకుందని, సామాన్య మానవులు కూడా గణిత శాస్త్రంతో సంబంధాలు కలిగి ఉంటారని ఆధునిక కాలంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా బేస్, కంప్యూటర్ ప్రోగ్రామింగ్, కోడింగ్, క్రిప్టోగ్రఫీ మొదలైన అంశాల్లో గణిత శాస్త్రము ముఖ్య భూమిక పోషిస్తుందని, నిద్రలేచినప్పటి నుంచి పడుకునే వరకు ప్రతి వ్యక్తికి గణితంతో సంబంధం ఉంటుందని తెలియజేశారు. తొలుత రామానుజన్ చిత్రపటానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. రామానుజన్ చాలా పేద కుటుంబంలో పుట్టిన వ్యక్తి అని అయినప్పటికీ గణిత శాస్త్ర అభివృద్ధికి ఆయన ఒక కారణజన్ముడని కొనియాడారు. ఏదైనా ఒక నెంబర్ చెబితే దాని యొక్క ప్రాధాన్యం చెప్పగల గొప్ప భారతీయ గణి శాస్త్రవేత్తని కొనియాడారు. గణిత శాస్త్ర అధ్యాపకులు సురేష్ మాట్లాడుతూ గణితశాస్త్రం నిజజీవితంలో ఒక భాగమని గణితం లేనిదే ఏ వ్యక్తి తన మనుగడ సవ్యంగా సాగించలేరని కొనియాడారు. అదేవిధంగా 1729 సంఖ్య గొప్ప తనాన్ని విద్యార్థులకు వివరించి దాని ఆకృతిని విద్యార్థుల ద్వారా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వ్యాసరచన, పోస్టర్ ప్రజెంటేషన్ మరియు ఆన్‌లైన్ క్విజ్ నిర్వహించి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను బాపమని, సారధి, మణికంఠ, ప్రసన్న, శిరీష, నవీన్‌లకు ప్రిన్సిపాల్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కె వెంకటేశరావు, ప్రగాఢ ప్రయాగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య సేవలు

విశాలాంధ్ర - ఏలేశ్వరం : స్పార్క్ సంస్థ (సైంటిఫిక్ ప్రోగ్రాం ఫర్ అకాడమిక్ అండ్ రీసెర్చ్ క్యూబ్)చైర్మన్ ఎస్.సాయి సందీప్ ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ గ్రహీత ఆధ్వర్యంలో ప్రాజెక్ట్ ఆరోగ్యలో భాగంగా స్పార్క్ సంస్థ అడ్వైజరీ బోర్డ్ డైరెక్టర్ వి వెంకట్ రెడ్డి జన్మదినం సందర్భంగా మెగా ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఆదిత్య హాస్పిటల్ ఏలేశ్వరం వారి సహాయ సహకారాలతో ఈ కంటి వైద్య శిబిరం మండలంలోని తిరుమాలి గ్రామంలో నేరేళ్లమ్మ తల్లి గుడి వద్ద కంటి వైద్య నిపుణులు ఆదిత్య పర్యవేక్షణలో కంప్యూటరైజ్డ్ పరికరాలతో స్పార్క్ సంస్థ ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని స్థానిక ఎస్సై రామలింగేశ్వరరావు ముఖ్య అతిథిగా విచ్చేసి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరానికి సుమారు 200 మంది వినియోగించుకున్నారు. ఈ కార్యక్రమంలో తిరుమాలి సర్పంచ్ వీర కృష్ణ ప్రసాద్, పసల సూర్యనారాయణ తెలుగుదేశం ఎంపీటీసీ, గ్రామ పెద్దలు కోరుకొండ నూకరాజు, కూరాకుల నాగరాజు, స్పార్క్ సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

పెదపట్నంలంకలో లక్ష తులసి పూజ

విశాలాంధ్ర - మామిడికుదురు : పెదపట్నంలంకలో శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయములో ఆదివారం లక్ష తులసి పూజ వైభవముగా నిర్వహించారు. అర్చకులు వాడపల్లి శేషాచార్యులు ఆధ్వర్యంలో ఖండవల్లి మురళి కృష్ణమాచార్యులు పర్యవేక్షణ లో పలువురు భక్త దంపతులు కర్తలుగా పాల్గొని లక్షతులసి పూజ నిర్వహించారు. ఆంజనేయస్వామికి పంచామృతాలతో, గంధ సింధూరం, తమలపాకులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా కమ్యూనిటీ క్రిస్మస్

విశాలాంధ్ర - అమలాపురం : ఈదరపల్లి హనుమాన్ థియేటర్ రోడ్‌లో ఉన్న జనకళ్యాణ్ టిబి ఆఫీస్‌లో రెడీమ్ చారిటబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో కమ్యూనిటీ క్రిస్మస్ కార్యక్రమాన్ని పాస్టర్ విజయబాబు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కమ్యూనిటీ క్రిస్మస్ వేడుకల్లో భాగంగా జనకళ్యాణ్ టిబి ప్రాజెక్ట్ మేనేజర్ జి శ్రీను మాట్లాడుతూ గత 4 సంవత్సరాలు నుండి జనకళ్యాణ్ సంస్థ క్రమం తప్పకుండా కమ్యూనిటీ క్రిస్మస్ కార్యక్రమంను కమ్యూనిటీ సభ్యుల సహకారంతో రీడమ్ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త భాగస్వామ్యంతో నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలు ఆఫీస్‌లో నిర్వహించటానికి ప్రధాన ఉద్దేశం కమ్యూనిటీలో ఐక్యత, ఆధ్యాత్మికత అలవర్చు కోవటానికి, ఆరోగ్య కరమైన జీవితాన్ని పెంపొందించుకోవడానికి ఈ కమ్యూనిటీ ఈవెంట్స్ ద్వారా కమ్యూనిటీకి అవగాహనా కల్పించటం జరుగుతుందని వివరించారు.

ఈ కమ్యూనిటీ క్రిస్మస్ కార్యక్రమంనకు బ్రదర్ ఏడ్వార్డ్ విలియమ్స్, అంతర్జాతీయ సువార్తకులు ముఖ్య ప్రశంగికులుగా విచ్చేసి కమ్యూనిటీ సభ్యులకు క్రిస్మస్ సందేశాన్ని వివరించారు. ప్రస్తుత యుగంలో మనిషి మనశాంతిని వెతుకుతున్నాడు కాని తను ఆశిస్తున్న మనశాంతి దొరకక సతమాత మవుతున్నాడని, నశించి పోతున్న మానవాళిని రక్షించటానికి యేసుక్రీస్తు లోక రక్షకుడిగా ఈ భూమి మీదకు విచ్చేసాడని, మీరు క్రీస్తే నిజమైన రక్షకుడిగా మీరు నమ్మగలిగేతే అదే నిజమైన క్రిస్మస్ అని కమ్యూనిటీ సభ్యులకు క్రిస్మస్ సందేశాన్ని అందించారు. తధానంతరం బ్రదర్ ఏడ్వార్డ్ విలియంని కమ్యూనిటీ మరియు టిబి తరపున ఏరియా హాస్పిటల్ డిఎస్ఆర్ సి కౌన్సిలర్ కవిత చేతుల మీదుగా సన్మానం చేశారు. ఈ కమ్యూనిటీ క్రిస్మద్ కార్యక్రమానికి ముమ్మిడివరం మండలం నుండి రాష్ట్ర అంగన్వాడీ మహిళా సాధికార ఆర్గనైసింగ్ సెక్రటరీ మెండి కమల, కమ్యూనిటీ లీడర్స్ సతీష్, భావన, సత్తిబాబు, కడలి సత్యనారాయణ మరియు కమ్యూనిటీ సభ్యులు, టిబి స్టాఫ్ రమణి, లోకేష్, శ్రీనివాస్ పీర్ ఎడ్యుకేటర్స్ గుర్రాల అమల, శ్యామల, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలకు పెద్దపీట

- ఎల్‌కేజీ టు పీజీ వరకు క్రీడలకు ప్రాధాన్యం
- విద్యాసంస్థల్లో క్రీడా ప్రాంగణాలు తప్పనిసరి
- నన్నయలో క్రీడా ఇండోర్, స్విమింగ్ పూల్ నిర్మాణాల పరిశీలన
- కాంట్రాక్టర్ తీరుపై శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు ఆగ్రహం

విశాలాంధ్ర - రాజానగరం : భారతదేశ జాతీయ పతాకాన్ని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఖ్యాతిని ప్రపంచ దేశాలకు చాటిచెప్పాలనే ఉద్దేశంతో రాష్ట్రం లోటు బడ్జెట్లో ఉన్నప్పటికీ ఏపీ ప్రభుత్వం క్రీడలకు పెద్ద పీట వేసిందని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) చైర్మన్ అనిమిని రవి నాయుడు అన్నారు. మండలంలోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ప్రాంగ ణంలో రూ.4.50 కోట్లతో ఖేల్ ఇండియా నిధులతో చేపట్టిన మల్టీ పర్పస్ ఇండోర్ స్టేడియం, రూ.3.80 కోట్లుతో చేపట్టిన స్విమ్మింగ్ పూల్, భవన నిర్మాణ పనులను వర్సిటీ విసి ఆచార్య వై. శ్రీనివాసరావు, స్థానిక ఎమ్మెల్యే బత్తుల బలరామ కృష్ణ, తెలుగు యువత జిల్లా అధ్యక్షులు కందుల బాబు రాయుడుతో కలిసి ఆదివారం పరిశీలించారు. దీని లో భాగంగా తాను వస్తున్నట్లు తెలిసిన సదరు కాంట్రాక్టర్ హాజర కాకపోవడం, భావన నిర్మాణాలు సకాలంలో పూర్తి చేయకపోవడంపై శాప్ చైర్మన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రి మార్గ దర్శకాల ప్రకారం పాఠశాలలో, విద్యాసంస్థల్లో క్రీడా ప్రాంగణం ఖచ్చితంగా ఉండాలని సూచించారు. తొలుత విసి పుష్పగుచ్చాలు అందించి స్వాగతం పలికారు .ఎమ్మెల్యే బలరామకృష్ణ, శాప్ చైర్మన్ రవి నాయుడుకు దుశ్శాలువ కప్పి, పుష్ప గుచ్చాలు అందించారు. ఇన్చార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య కె.వి.స్వామి, డిప్యూటీ రిజిస్ట్రార్ ఎస్.లింగారెడ్డి, యూనివర్సిటీ ఇంజనీర్ డాక్టర్.కె.నూకరత్నం, ఎడ్యుకేషన్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్.కె.సుబ్బారావు, శాప్ అధికారులు, ఇంజనీర్లు, పీడీలు పాల్గొన్నారు.

27న రాజమండ్రికి తరలిరండి

– సీపీఐ శతదినోత్సవాలు విజవంతంచేయండి – జిల్లా కార్యదర్శి తాటిపాక మధు

విశాలాంధ్ర – గోపాలపురం, నిడదవోలు, పెరవలి : భారత కమ్యూనిస్టు పార్టీ భారతదేశంలో ఆవిర్భవించి డిసెంబర్ 26 నాటికి100 వసంతాలు పూర్తి చేసుకుంటుంది. వంద సంవత్సరాలు పోరాట పార్టీగా చరిత్మక విజయాలు గుర్తు చూసుకుంటే మరుపురాని, మధుర స్మృతులు ఎన్నో ఉన్నాయని, భారత కమ్యూనిస్టు పార్టీదేశానికి స్వాతంత్ర పోరాటం దగ్గర నుండి భారతదేశంలో ప్రతి నిరుపేదకి కూడు గుడ్డ విద్య, వైద్యం కోసం శ్రమించి పోరాడిన పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు పేర్కొన్నారు. ఆదివారము సీపీఐ జిల్లా బృందం పెరవలి మండలం, నిడదవోలు మండలం, గోపాల వరం మండలం భీమోలు గ్రామంలో సమావేశాలు జరిగాయి. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మధు మాట్లాడుతూ 27న రాజమండ్రికి తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్మిక కర్షక శ్రమజీవుల, హక్కుల కోసం, భారతదేశంలో దోపిడీ వ్యవస్థను పారద్రోల దానికి, దున్నేవాడిదే భూమి నినాదం తెచ్చిన పార్టీ ప్రతి పేదవాడికి రెండు ఎకరాలు భూమి ఇవ్వాలని ప్రతిపాదన తెచ్చి దానిని సారాకార్థం చేయడానికి శ్రమించిన పార్టీ సీపీఐ అన్నారు. ఇళ్ల స్థలాలు, ఇండ్ల నిర్మాణం, ధరల నియంత్రణ, రవాణా చార్జీలు, విద్యుత్ చార్జీలు, పెట్రోల్ డీజిల్ ధరలు నియంత్రణ , ప్రభుత్వ రంగ పరిశ్రమలు ప్రైవేట్ కారణం నివారించపోరాడడం, దేశం సంక్షేమం, శాంతిభద్రతలు గాడితప్పేప్రభుత్వపాలన సజీవంగా పరిపాలనకు తోడ్పాటు,గ్రామ పట్టణాల అభివృద్ధి, నిరుద్యోగుల యువతి యువకులకు ఉద్యోగ కల్పన కోసం, ఆరోగ్య భద్రత కోసం సామాజిక న్యాయం కావాలని పోరాటపటిమలో భాగమే అంతటి చరిత్ర కలిగిన సిపిఐ ఆవిర్భవించి వంద సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా సిపిఐపార్టీ విశిష్ట తను చాటిచెప్పేలా వాడవాడలా సిపిఐ జెండా రెపరెపలాడాలని భావిస్తు డిసెంబర్ 26 జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించి, అదేవిధంగా 27న రాజమండ్రిలో ఎర్రసైన్యం కవాతుకు తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశములో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు పి. నాగేశ్వరావు కె జ్యోతిరాజు, తోట లక్ష్మణ్, జిల్లా సమితి సభ్యులు ఎం ప్రసాద్, కాకులపాటి వెంకట్రావు, కోవదయ్య పాల్గొన్నారు.

ఉద్యోగం భార్యది.. విధులు నిర్వహించేది భర్త

పట్టించుకోని గ్రామ పంచాయతీ అధికారులు

విశాలాంధ్ర – జగ్గంపేట : కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం రామవరం గ్రామ పంచాయ తీలోని జూనియర్ అసిస్టెంట్ భార్య విధులను భర్త నిర్వర్తిస్తున్నా అధికారులు కళ్ళు మూసుకున్నారు. పైగా అతనే జూనియర్ అసిస్టెంట్ అంటారు. అంటే ఆ పంచాయితీలోను, ఆ మండలములోను ఆయన ఏ విధంగా చక్రం తిప్పుతున్నారు అనేది ఇట్టే అర్థం అవుతుంది. మండలంలోని మేజర్ పంచాయతీల్లో రామవరం ఒకటి. ఇక్కడ పంచాయ తీలో ఒక కార్యదర్శి పోస్టు, మరోక జూనియర్ అసిస్టెంట్ పోస్టు ఉన్నాయి. జూనియర్ పోస్టులో రాగాలు అనే మహిళా ఉద్యోగి ఉన్నారు. ఐతే అమె ఎప్పుడో కానీ విధులకు హాజరుకారు. అంతా అమె భర్తే చూసుకుంటారు. భార్య సంతకాలను కుడా ఆయనే పెట్టెస్తారు. ఇక పంచాయితీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు కుడా ఆయనే జూనియర్ అసిస్టెంట్ అంటారు. ఆయనకు మరో మైనర్ పంచాయతీల బాధ్యతను అప్పగిస్తారు. గత ప్రభుత్వంలో పంచాయతీ కార్యదర్శి లేకపోతే ఆయనే కార్యదర్శిగా వ్యవహరించారు. ఐతే కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఇటీవలే పంచాయితీ కార్యదర్శి వచ్చారు. ఐనా ఇప్పటికీ ఆ గ్రామంలోని ప్రజలు ఆయనే కార్యదర్శి అనుకుంటారు. అలానే పిలుస్తారు. సంవత్సరాల నుండి ఇలా విధులు నిర్వర్తిస్తున్నా ఉన్నతాధికారులు పట్టించుకోకపడటంపట్ల పలు అనుమానాలకు తావిస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికారులు స్పందించాలని పలువురు కోరుతున్నారు. దీనిపై ఎంపిడిఓ జెవివిఎస్ చంద్రశేఖర్‌ను వివరణ కోరగా ఈ విషయం తన దృష్టికి వచ్చిందని, కార్యదర్శికి అదేశాలు ఇచ్చామని తెలియజేశారు.

ప్రభుత్వ నిబంధనల ప్రకారం మెనూ

కలెక్టర్ మహేష్ కుమార్

విశాలాంధ్ర – కాకినాడ, రామచంద్రపురం : ప్రభుత్వ నిబంధనల మెనూ ప్రకారం ప్రతిరోజు ఆరోగ్యకరమైన భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ గురుకుల సంక్షేమ అధికారులను ఆదేశించారు. మండల పరిధిలోని వెలంపాలెం మహాత్మా జ్యోతిరావు పూలే ఏపీ బీసీ వెల్ఫేర్ గురుకుల బాలికల పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన బాలికలను వసతి గృహ స్థితిగతులు కల్పిస్తున్న సౌకర్యాలు మెనూ అమలు తరగతులు నిర్వహణ అంశాలపై ఆరా తీశారు. స్టడీ అవర్స్ నిర్వహణ, పదో తరగతి విద్యార్థులకు వంద రోజులు కార్యాచరణ ప్రణాళిక అమలు తీరు గురుకులంలో త్రాగునీటి సౌకర్యాలు తరగతి గదులు వంటగది డైనింగ్ హాలు స్టోర్ రూమ్‌ల స్థితిగతులను ఆయన పరిశీలించారు. బాలికలను గురుకుల సమస్యల పట్ల ఆరా తీయగా వర్షాలు పడినప్పుడు స్లాబ్ లీక్ అవుతోందని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకుని రాగా, భవనం శిథిలావస్థకు చేరుకుందని వేరే ప్రైవేట్ అద్దె భవనంలోకి గురుకులాన్ని మార్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. బాలికల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ గురుకుల అధికారులకు సూచించారు. ఎటువంటి ఒత్తిళ్లకు గురికాకుండా బాలికలు ప్రశాంత వాతావరణంలో విద్యను అభ్యసించి నేటి పోటీ ప్రపంచంలో రాణించేలా ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ది ఉజ్వల భవిష్యత్తును పొందే విధంగా ఉపాధ్యాయ సమాజం అంకితభావంతో పాటుపడాలని సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా పారిశుద్ధ్య నిర్వహణ ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం ఆర్డిఓ అఖిల, తహశీల్దార్ సావిత్రి, గురుకుల సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

విశాలాంధ్ర – ఏలేశ్వరం : స్థానిక ఏపీఎస్ ఆర్టీసీ డిపో పరిధిలో సోమవారం డయల్ యువర్ డిఎం కార్యక్రమం నిర్వహించనున్నట్టు డిపో మేనేజర్ జివి సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏలేశ్వరం డిపో పరిధిలోని ప్రయాణికులకు, ఆర్టీసీ బస్సులలో ప్రయాణమే సురక్షితమని అన్నారు. అంతేకాకుండా ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఏపీఎస్ ఆర్టీసీ సంస్థ పురోగతికి ప్రయాణికులు అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీ డిపోలో ఏమైనా అసౌకర్యాలు గాని ఎటువంటి ఇబ్బందులు వున్నా ప్రయాణికులు తమ సూచనలు సలహాలు నేడు అనగా సోమవారం ఉదయం 11గం నుండి 12 గం.వరకు నిర్వహించే డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమానికి ఇక్కడ తెలిపిన ఫోన్ నెంబర్ 9959225532కి కాల్ చేసి ప్రత్యక్షంగా తెలపాలని ఆయన కోరారు.

అమలాపురంలో బెల్ట్ షాపులకు తావులేదు

ఎమ్మెల్యే ఆనందరావు హెచ్చరిక

విశాలాంధ్ర – అమలాపురం : అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గంలో మద్యం బెల్ట్ షాపులకు తావులేదని ఎవరైనా బెల్ట్ షాప్‌లు నిర్వహిస్తే ఉపేక్షించబోమని వారిపై కఠిన చర్యలు తీసుకునే వరకూ వదిలిపెట్టే ప్రసక్తి లేదని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు హెచ్చరించారు. ఆదివారం అముడా చైర్మన్ అల్లాడి సోంబాబు స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆనందరావు మాట్లాడుతూ రాష్ట్రంలో బెల్టుషాపుల లేకుండా చేయాలన్నది ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు లక్ష్యమని తాను కూడా బెల్టుషాపుల లేని అమలాపురం చేయాలన్న లక్ష్యంతో పని చేస్తున్నానని చెప్పారు. అమలాపురంలో బెల్ట్ షాపులు నిర్వహిస్తే ఉక్కు పాదంతో అణచి వేయాలని ఇప్పటికే ఎక్సైజ్ అధికారులను ఆదేశించామని తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు గ్రామాల్లో ఎక్కడ మద్యం బెల్ట్ షాపులు నిర్వ హిస్తున్నట్లు తెలిస్తే వెంటనే తనకు తెలియజేయాలని ఎమ్మెల్యే ఆనందరావు పిలుపునిచ్చారు. ఎక్సైజ్ అధికారులు గ్రామాల్లో ఎవరైనా ఎక్కడైనా బెల్ట్ షాపులు నిర్వహిస్తే వారిని వెంటనే అరెస్టు చేసి జైలుకి పంపాలని ఎమ్మెల్యే ఆనందరావు ఆదేశించారు. అమలాపురం నియోజకవర్గం పరిధిలో మద్యం సిండికేట్లు ఎవరు బెల్ట్ షాపులు నిర్వహించరాదని ఆయన హెచ్చరించారు. తప్పు చేస్తే అధికారులను సైతం వదిలే ప్రసక్తి లేదన్నారు. సమావేశంలో మెట్ల రమణ బాబు, అముడా చైర్మన్ అల్లాడి స్వామి నాయుడు, అధికారి బాబ్జీ, దున్నాల దుర్గ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యలు తీర్చడానికి కృషి

విశాలాంధ్ర – రాజమహేంద్ర వరం : రాజమహేంద్ర వరం నగరములో ట్రాఫిక్ సమస్యలు తీర్చడానికి ట్రాఫిక్ పోలీసు విభాగంతో కలిసి ప్రణాళిక తయారు చేస్తున్నా మని కమిషనరు కేతన్ గార్గ్ పేర్కొన్నారు. ఆదివారం ట్రాఫిక్, నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ పబ్లిక్ హెల్త్ విభాగాల అధికారులతో కలిసి నగరములోని ముఖ్య కూడళ్లను పరిశీలించారు. ఈ సందర్భముగా కేతన్ గార్గ్ మాట్లాడుతూ నగరములో ముఖ్య కూడళ్లలో పార్కింగు సమస్య అధికముగా ఉందని, ప్రజలు తమ వాహనాలను ఇష్టానురీతిగా నిలుపుదల చేస్తున్నారని, అందువలన వాహనాల కదలికలకు అంతరాయము కలగటమే కాకుండా, ప్రమాదాలు జరగడం, వాహనదారుల మధ్య గొడవలు నిత్యము జరుగుతున్నాయని, వీటన్నిటిని పరిష్కరించడానికి ప్రణాళిక తమారు చేయడం జరుగుతుందని అన్నారు. ప్రజలు తమ వాహనాలను కూడళ్లకు 50 అడుగుల దూరములో నిలిపి ఉంచడానికి స్థలము కేటాయించి, ద్విచక్ర వాహనాలు, కార్లు వేరు వేరుగా నిలిపేలా చూస్తామని అందువలన పాదచా రులకు ఎటువంటి సమస్య లేకుండా ఉంటుందని తెలియచేసారు. ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన పరికరాలు, సామగ్రి వివరాలు పూర్తి స్థాయిలో తయారు చేయాలని ఆదేశించారు. నగర పాలక సంస్థ ప్రణాళికా విభాగము మరియు ట్రాఫిక్ పోలీసు విభాగము సమిష్టిగా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమములో సిటీ ప్లానరు జి.కోటయ్య, డిప్యూటీ సిటీ ప్లానరు సి.హెచ్. సత్యనారాయణ రాజు, మునిసిపల్ హెల్త్ ఆఫీసరు ఎ.వినూత్న, ట్రాఫిక్ పోలీసు విభాగము అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

కరుటూరి నరసింహారావు

విశాలాంధ్ర – ఆత్రేయపురం : గోపాలపురం డిస్ట్రిబ్యూ టర్ కమిటీ చైర్మన్ ఎన్నికైన అంకంపాలెంకు చెం దిన కరుటూరి నరసింహా రావుకు మరో పదవి వరించింది. అత్యంత కీలకమైన ప్రాజెక్ట్ కమిటీ ఉపాధ్య క్షుడిగా ఎన్నికయ్యారు. ఈయన గతంలో గ్రామ సర్పంచ్‌గా, వాడపల్లి దేవ స్థానం చైర్మన్‌గా పనిచేసి అందరి మన్ననలు చూరగొన్నారు. ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్ష పదవికి ఎంపిక కావడం పట్ల ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ఆకుల రామకృష్ణ, కెవి సత్యనారాయణ రెడ్డి, ముదునూరి వెంకటరాజు, ముల్ల పూడి భాస్కరరావు, నియోజకవర్గ దేశం పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నీటి బొట్టును ఒడిసి పట్టి, చివరి ఎకరం వరకూ సాగు నీరు అందజేయాలనే, రైతుల అభ్యున్నతికి పాటుపడ తానని, సాగునీటి సమస్యలు ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని నరసింహారావు అన్నారు.